


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 141 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : డాక్టర్ బి.ఆర్. అంబెద్కర్ కోనసీమ జిల్లా గురువారం 2 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 141 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : Dr. B.R. AMBEDKAR KONASEMA DIST THU 2 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,Thadepalligudem,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణం..
## పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణం

సతీసమేతంగా హాజరైన సీఎం చంద్రబాబు

స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పణ

వేదమంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా జరిగిన వేడుక

కల్యాణాన్ని వీక్షించేందుకు భారీగా తరలివచ్చిన భక్తులు

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు, తన అర్ధాంగి నారా భువనేశ్వరితో కలిసి స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఈ వేడుక అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా సాగింది. ఈ దివ్య కల్యాణ మహోత్సవం కోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. విద్యుత్ దీపాల కాంతులతో ఆలయ ప్రాంగణం దేదీప్యమానంగా వెలిగిపోయింది. వేలాది మంది భక్తులు ఈ అపురూప ఘట్టాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు తరలివచ్చారు. రామనామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. పండితులు సంప్రదాయబద్ధంగా కల్యాణ ఘట్టాన్ని నిర్వహించి, భక్తులకు స్వామివారి ఆశీస్సులు అందజేశారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలలో

- మిగతా 2లో

## ఇరాన్ గత పాలకుడి కంటే ఇతను కొంచెం నయం



- కాల్పుల విరమణ కోసం ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ అభ్యర్థించారని ట్రంప్ వెల్లడి
- అతడికి తక్కువ తీవ్రవాద భావజాలం, ఎక్కువ తెలివితేటలు ఉన్నాయని వివరణ
- హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిస్తేనే కాల్పుల విరమణపై పరిశీలన అని షరతు
- షరతులు అంగీకరించకుంటే ఇరాన్‌ను నామరూపాల్లేకుండా చేస్తామని హెచ్చరిక
- మళ్లీ రాతియుగానికి పంపిస్తాం అంటూ పోస్ట్

- మిగతా 2లో



## అమరావతిపై చంద్రబాబుది డ్రామా.. ఇదే మా ప్లాన్ బీ

- అమరావతిపై అసెంబ్లీ తీర్మానం ఒక డ్రామా అన్న జగన్
- రాజధానిపై ప్లాన్-బీ ప్రతిపాదించిన మాజీ సీఎం
- మచిలీపట్నం-విజయవాడ-గుంటూరుతో 'మావిగన్' కారిడార్ సూచన
- సీఎం, మంత్రులు హైదరాబాద్‌కు షటిల్ సర్వీస్ చేస్తున్నారంటూ విమర్శ
- అమరావతి పేరిట లక్షల కోట్ల దోపిడీకి ప్లాన్ చేస్తున్నారని ఆరోపణ

- మిగతా 2లో

## ఏపీ ప్రజలకు అభినందనలు..
## కానీ మా సంగతేంటి?

- అమరావతి బిల్లుకు చట్టబద్ధత కల్పించడాన్ని స్వాగతిస్తున్నాం... కానీ!: పొన్నం ప్రభాకర్
- బిల్లుకు చట్టబద్ధత నేపథ్యంలో ఏపీ ప్రజలకు అభినందనలు తెలిపిన మంత్రి
- అయితే కేంద్రం తెలంగాణకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని విమర్శ
- ఒక రాష్టానికి చట్టబద్ధత కల్పిస్తూ, మరో రాష్టానికి హామీలు విస్మరించడం సరికాదన్న మంత్రి



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఏర్పాటుకు చట్టబద్ధత కల్పిస్తూ లోక్ సభలో బిల్లు ఆమోదించడాన్ని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఇదే సమయంలో ఆయన కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.తెలంగాణ రాష్టానికి విభజన సందర్భంగా ఇచ్చిన హామీల

- మిగతా 2లో

# అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్ సభ ఆమోదం

## నేడు రాజ్యసభ ముందుకు బిల్లు

- ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత
- పునర్విభజన చట్ట సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- చర్చ నుంచి వాకౌట్ చేసిన వైసీపీ ఎంపీలు
- నేడు రాజ్యసభ ముందుకు రానున్న బిల్లు
- రాష్ట్రపతి ఆమోదంతో చట్టంగా మారనున్న బిల్లు





**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే కీలక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ బుధవారం 'ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం సవరణ బిల్లు-2026'ను సభలో ప్రవేశపెట్టారు. చర్చ అనంతరం, ఈ బిల్లు ఆమోదం పొందినట్లు ప్యానెల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లుపై సభలో సుమారు రెండు గంటల పాటు సుదీర్ఘ చర్చ జరిగింది. తెలుగుదేశం, బీజేపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీలు బిల్లుకు మద్దతు పలకగా, వైసీపీ ఎంపీలు చర్చ మధ్యలో సభ నుంచి వాకౌట్ చేశారు. 2024 జూన్ 2 నుంచి ఈ సవరణ వర్తించేలా బిల్లులో పొందుపరిచారు. ఈ చట్ట సవరణతో రాష్టానికి అమరావతి ఏకైక రాజధానిగా చట్టపరమైన భద్రత లభిస్తుంది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, "అమరావతి రైతుల కన్నీళ్ల మీద ఈ చట్టం నిర్మాణమైంది. ఇది ఆంధ్ర ప్రజల కలల రాజధాని" అని అన్నారు. బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, "అమరావతి ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధానిగానే ఉంటుంది" అని స్పష్టం చేశారు.లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లు నేడు గురువారం (ఏప్రిల్ 2) రాజ్యసభ ముందుకు వెళ్లనుంది. పెద్దల సభలో కూడా ఆమోదం పొందితే, రాష్ట్రప తి ఆమోదంతో చట్టంగా మారనుంది. దీం తో గతంలో వచ్చిన మూడు రాజధానుల ప్రతిపాదనకు చట్టపరంగా తెరపడినట్లవుతుంది.



## అనిల్ అంబానీ చుట్టూ బిగుసుకుంటున్న ఉచ్చు...

### తాజాగా కేసు నమోదు చేసిన సీబీఐ

- ఎల్ఐసీకి రూ.3,750 కోట్ల నష్టం కలిగించారన్న ఆరోపణలు
- రిలయన్స్ కమ్యూనికేషన్స్, అనిల్ అంబానీపై సీబీఐ కేసు నమోదు
- తప్పుడు సమాచారంతో రూ.4,500 కోట్ల ఎన్‌సీడీలు విక్రయించారని ఫిర్యాదు
- ఫోరెన్సిక్ ఆడిట్ నివేదిక ఆధారంగా ఫిర్యాదు చేసిన ఎల్ఐసీ
- ఇప్పటికే పలు బ్యాంకుల మోసం కేసులను ఎదుర్కొంటున్న ఆర్‌కామ్

- మిగతా 2లో

## హిట్ అండ్ రన్ నేరాల కంటే ఘోరంగా ఓ పార్టీ రాజకీయాలు చేస్తోంది



- వింజమూరు సభలో వైసీపీని టార్గెట్ చేసిన సీఎం చంద్రబాబు
- కళ్లార్పకుండా అసత్యాలు ప్రచారం చేస్తోందని ఆగ్రహం
- నెల్లూరు జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట వేస్తామని హామీ
- గోదావరి పుష్కరాల్లోగా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని వెల్లడి
- చేనేతలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం ప్రారంభం

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు పరోక్షంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హిట్ అండ్ రన్ నేరాల కంటే ఘోరంగా ఓ పార్టీ రాజకీయాలు చేస్తోందని, కళ్లార్పకుండా అసత్యాలు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. నెల్లూరు జిల్లా వింజమూరులో జరిగిన 'పేదల సేవలో'

- మిగతా 2లో



## ఇరాన్ మిస్సైళ్లు యూరప్‌ను కూడా తాకగలవు

- యూరప్‌ను తాకగల క్షిపణులను ఇరాన్ అభివృద్ధి చేసిందన్న రూబియో
- అణుబాంబు తయారీకి ఇరాన్ అత్యంత సమీపంలో ఉందని వెల్లడి
- ఇరాన్‌పై సైనిక చర్య విజయవంతంగా సాగుతోందన్న అమెరికా
- చర్చలకు సిద్ధమేనని, కానీ షరతులు వర్తిస్తాయని స్పష్టం
- హోర్ముజ్ జలసంధిలో జోక్యం చేసుకోవద్దని ఇరాన్‌కు హెచ్చరిక

- మిగతా 2లో

## తేయాకు ఆకులు కోసి, కార్మికులతో సెల్ఫీ దిగిన ప్రధాని నరేంద్రమోదీ

- అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అసోంలో పర్యటించిన ప్రధాని మోదీ
- తేయాకు తోటను సందర్శించి మహిళా కార్మికులతో కలిసి ఆకులు కోసిన వైనం
- గోగాముఖ్‌లో జరిగిన బహిరంగ సభకు హాజరు
- అసోంలో బీజేపీ హ్యాట్రిక్ సాధిస్తుందని ధీమా
- రాహుల్ గాంధీకి వందోసారి ఓటమి తప్పదని వ్యాఖ్యలు

- మిగతా 2లో



## జగన్ వ్యాఖ్యలన్నీ అబద్ధాలే.. అమరావతిపై మంత్రి నారాయణ సమగ్ర వివరణ

- అమరావతి నిర్మాణ ఖర్చుపై జగన్ చెప్పేవన్నీ అబద్ధాలని ఖండన
- ప్రజాధనం ఒక్క పైసా లేకుండానే అమరావతి నిర్మాణం అని స్పష్టీకరణ
- అమరావతి ఆర్థిక రాజధానిగా రాష్టానికి ఆదాయం తెస్తుందని వెల్లడి
- 2028 ఆగస్టు నాటికి రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామని ధీమా

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# అమరావతికి ఓకే.. కానీ, కండీషన్స్ అప్లై

రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు గాను ఏపీ పునర్విభజన చట్టానికి సవరణలు చేసేందుకు లోక్ సభ ఆమోదముద్ర వేసింది. అధికార, విపక్షాలు అన్నీ ఈ చట్ట సవరణకు మద్దతు తెలపడంతో మూజువాణి ఓటుతోనే లోక్ సభ ఆమోదముద్ర వేసినట్లైంది. అయితే సభలో ఈ అంశంపై మాట్లాడిన వివిధ పార్టీలు బిల్లుకు మద్దతు చెబుతూనే కొన్ని అభ్యంతరాలు లేవనెత్తడం విశేషంగా వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా బిల్లును యథాతథంగా ఆమోదించలేమంటూ వాకౌట్ చేసిన వైసీపీతోపాటు బిల్లును సమర్ధించిన కాంగ్రెస్, ఎస్పీ తదితర పార్టీలు కొన్ని కీలకసూచనలు చేశాయి.రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన రైతులకు ముందుగా న్యాయం చేయాలని వివిధ పార్టీలు సూచించాయి. ప్రధానంగా వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ రాజధాని నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారు? రైతులకు అభివృద్ధి చేసి ఇస్తామన్న ప్లాట్లు ఎప్పుడిస్తారు? రైతులు ఎలా న్యాయం చేస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాజధాని మొదటి దశ నిర్మాణం పూర్తికాకుండానే అదనపు భూ సమీకరణకు ఎందుకు వెళుతున్నారో స్పష్టం చేయాలని కోరారు.ఇక మిథున్ రెడ్డి తర్వాత సభలో మాట్లాడిన కాంగ్రెస్, సమాజ్ వాది ఎంపీలు సైతం అమరావతి బిల్లును సమర్థిస్తూనే కొన్ని సూచనలు చేశారు. ప్రధానంగా సమాజ్ వాది పార్టీకి చెందిన ఎంపీ ధర్మేంద్ర యాదవ్ వ్యాఖ్యలు ఆసక్తికర చర్చకు దారితీశాయి. రాజధాని అమరావతి బిల్లును తాము సమర్థిస్తున్నామని, అయితే రాజధానిగా విశాఖను ఎంపిక చేస్తే బాగుండేదని ధర్మేంద్ర యాదవ్ వ్యాఖ్యానించారు. అదేవిధంగా తమ పార్టీ రైతుల పక్షపాతి అని పేర్కొంటూ రాజధాని రైతులకు తక్షణ న్యాయం చేయాలని సమాజ్ వాది తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.కాంగ్రెస్ నేత మాణిక్కం ఠాగూర్ సైతం రాజధానిగా అమరావతికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఎవరూ ఏపీకి అన్యాయం చేయాలని చూసినా తమ పార్టీ అంగీకరించదని తేల్చిచెప్పారు. అయితే రాజధాని రైతులకు న్యాయం చేయడం విస్మరించొద్దని సూచించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన తెలంగాణ ఎంపీలు రఘురామిరెడ్డి, గడ్డం వంశీకృష్ణ సైతం రాష్ట్ర పునర్విభజన సవరణ బిల్లుపై జరిగిన చర్చలో పాల్గొన్నారు. విభజన హామీలను నెరవేర్చాలని వంశీకృష్ణ కోరగా, ఖమ్మంజిల్లాకు చెందిన గ్రామాలను తిరిగి తెలంగాణకు వదిలేయాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి వ్యాఖ్యానించారు. మొత్తానికి రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే విషయంలో అన్నిపార్టీలు ఒకే మాటపై నిలబడినా, రాజధాని రైతుల విషయంలో విపక్షం కొంచెం గట్టిగా మాట్లాడటం ప్రత్యేకంగా నిలిచిందని అంటున్నారు.

# హిట్ అండ్ రన్ నేరాల కంటే ఘోరంగా ఓ పార్టీ రాజకీయాలు చేస్తోంది

- మొదటి పేజి తరువాయి

కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ఆయన ప్రసంగించారు. ప్రతిపక్షం చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు.

**హిట్ అండ్ రన్ కంటే దారుణం**

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ విషయంలో వైసీపీ అసత్యాలు ప్రచారం చేస్తోందని చంద్రబాబు ఆరోపించారు. 2018–19లోనే తమ ప్రభుత్వం రూ.285 కోట్లతో హార్బర్ నిర్మాణానికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపిందని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు ఆ వాస్తవాలను వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కృష్ణపట్నం పోర్టును వాణిజ్యపరంగా మార్చినప్పుడు నాటి కాంగ్రెస్ పాలకులు పట్టించుకోలేదని అన్నారు. కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు మత్స్యకారులకు ఎన్నడూ అన్యాయం చేయరని భరోసా ఇచ్చారు. ఏపీ జలాల్లోకి తమిళనాడు మత్స్యకారులు వచ్చి వేట చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని నెల్లూరు, తిరుపతి కలెక్టర్లకు వేదిక నుంచే చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**సంక్షేమ పథకాల వెల్లువ**

ప్రజలపై ఉన్న అభిమానంతోనే తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని చంద్రబాబు తెలిపారు. ప్రతి నెలా రూ.2,750 కోట్లను కేవలం పెన్షన్ల కోసమే వ్యయం చేస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని, పొరుగున ఉన్న తమిళనాడులో కేవలం రూ.1000 మాత్రమే ఇస్తున్నారని పోల్చి చెప్పారు. 'తల్లికి వందనం' కింద గత ఏడాది అందించిన ఆర్థిక సాయాన్ని మళ్లీ జూన్‌లో ఆడబిడ్డల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. 'దీపం 2.0' పథకం కింద ఏటా మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తున్నామని, త్వరలోనే పైపులైన్ల ద్వారా ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు.

**అభివృద్ధి, పెట్టుబడులే లక్ష్యం**

సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధికి కూడా తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.1300 కోట్లు అడ్వాన్స్‌గా ఇచ్చిందని, గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని, రామాయపట్నం, దుగరాజపట్నం వంటి పోర్టులు రానున్నాయని తెలిపారు. ఉదయగిరిలో డ్రోన్లు, మానవ రహిత విమానాల తయారీ పరిశ్రమ రాబోతోందని, పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానంగా మారిందని అన్నారు. ఇఫ్కో సెజ్ ద్వారా 80 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు.

**సుపరిపాలన – చేనేతలకు వరం**

సుపరిపాలన అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ మహాయజ్ఞానికి ఎవరు ఆటంకం కలిగించినా సహించేది లేదని, ప్రభుత్వ సేవల్లో లోపాలుంటే ఆకస్మిక తనిఖీలు చేస్తానని హెచ్చరించారు. డిసెంబరు నాటికి 4.5 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలు చేయిస్తామన్నారు. ఈ సందర్భంగా, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద 93 వేల చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు, 11,443 పవర్‌లూమ్‌లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని, ఇందుకోసం రూ.153 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. అనంతరం, లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా చేనేతలు సీఎంను నూలు దండతో సత్కరించారు.

# తేయాకు ఆకులు కోసి, కార్మికులతో సెల్ఫీ దిగిన ప్రధాని నరేంద్రమోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అసోంలోని దిబ్రుగఢ్ జిల్లాలోని ఒక తేయాకు తోటను సందర్శించారు. అక్కడి మహిళా కార్మికులతో కలిసి తేయాకు ఆకులను కోశారు. వారితో సెల్ఫీలు దిగారు. ఈ ఫొటోలను మోదీ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. పలువురు కార్మికులు మోదీతో సెల్ఫీ దిగేందుకు ఆసక్తి చూపించారు. మోదీ రాక నేపథ్యంలో గిరిజన కార్మికులు సంప్రదాయ నృత్యంతో ఆయనకు స్వాగతం పలికారు.

**బహిరంగ సభలో రాహుల్ గాంధీపై విమర్శలు**

అసోం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గోగముఖ్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అసోంలో బీజేపీ మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ యువరాజు రాహుల్ గాంధీకి వందోసారి ఓటమి తప్పదని ఎద్దేవా చేశారు.అసోం మాజీ సీఎం శర్బానంద సోనోవాల్, ప్రస్తుత ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ విభజన విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. అసోంలో ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఆదివాసీల హక్కులను కాపాడుతామని హామీ ఇచ్చారు.

# అమరావతిపై చంద్రబాబుది డ్రామా.. ఇదే మా ప్లాన్ బీ

అమరావతి రాజధాని నిర్మాణంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమరావతిని రూ.2 లక్షల కోట్ల భారీ ఆర్థిక కుంభకోణంగా అభివర్ణించిన ఆయన, దీనికి ప్రత్యామ్నాయంగా 'ప్లాన్ బి' పేరుతో 'మావిగన్' (మీూఎ×+ూచీ) అనే కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుతూ ఈ రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయవచ్చని ఆయన సూచించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈరోజు మీడియాతో మాట్లాడారు.

**ఏమిటీ 'మావిగన్' ప్లాన్?**

జగన్ వివరించిన 'మావిగన్' ప్రణాళిక ప్రకారం, మచిలీపట్నం నుంచి విజయవాడ (70 కి.మీ.), విజయవాడ నుంచి గుంటూరు (40 కి.మీ.) వరకు విస్తరించి ఉన్న 110 కిలోమీటర్ల కారిడార్‌ను రాజధాని ప్రాంతంగా ప్రకటించాలి. ఈ ప్రాంతంలో ఇప్పటికే 35–40 లక్షల జనాభా నివసిస్తోందని, జాతీయ రహదారి వంటి మౌలిక సదుపాయాలు ఉన్నాయని జగన్ గుర్తుచేశారు. అమరావతికి ప్రతిపాదించిన రూ.2 లక్షల కోట్లలో కేవలం 10% నిధులు, అంటే రూ.20,000 కోట్లతో ఈ ప్రాంతంలో రింగ్ రోడ్లు, ఇతర అనుసంధాన మార్గాలు ఏర్పాటు చేస్తే, ఇది సహజంగానే ఒక మెగాసిటీగా, అభివృద్ధి కేంద్రంగా మారుతుందని ఆయన వివరించారు. తన హయాంలో మచిలీపట్నం పోర్టు పనులు ప్రారంభించామని, దానివల్ల ఈ ప్రాంతానికి మరింత ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఇప్పటికే అభివృద్ధి చెందిన ఈ ప్రాంతంలో అవినీతికి ఆస్కారం తక్కువ కాబట్టే, ప్రస్తుత ప్రభుత్వం ఈ ప్రణాళికను పక్కన పెట్టిందని ఆరోపించారు.

**అమరావతి.. అవినీతి రాజధాని**

అమరావతిని 'అవినీతి రాజధాని'గా జగన్ అభివర్ణించారు. చంద్రబాబు ప్రభుత్వమే కేంద్రానికి, బ్యాంకులకు ఇచ్చిన లెక్కల ప్రకారం, అమరావతిలో కేవలం రోడ్లు, కరెంట్, డ్రైనేజీ వంటి కనీస వసతులకే ఎకరానికి రూ.2 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. ఈ లెక్కన 50,000 ఎకరాలకు రూ.1 లక్ష కోట్లు, లక్ష ఎకరాలకు రూ.2 లక్షల కోట్లు అవసరమవుతాయని, ఇది రాష్ట్రాన్ని దివాళా తీయించడానికేనని విమర్శించారు. చంద్రబాబు తన గత, ప్రస్తుత పాలనలో కలిపి ఏడేళ్లలో కేవలం రూ.8,000 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, ఈ వేగంతో ప్రాజెక్టు పూర్తి చేయడానికి ఎన్ని దశాబ్దాలు పడుతుందని ప్రశ్నించారు.నిర్మాణ వ్యయాల్లో భారీ అవినీతి జరుగుతోందని జగన్ ఆరోపించారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల్లో ఐదు నక్షత్రాల సౌకర్యాలతో ఫ్లాట్ నిర్మించడానికి చదరపు అడుగుకు రూ.4,500 ఖర్చయితే, అమరావతిలో రూ.11,000 నుంచి రూ.14,000 వరకు చూపిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక, భూమి, జీఎస్టీ మినహాయింపులు ఇస్తున్నా ఇంత భారీ వ్యయం ఎందుకని నిలదీశారు. టవర్ల నిర్మాణం, ఫ్లైఓవర్ల వ్యయాన్ని ఇతర నగరాలతో పోల్చి, భారీ వ్యత్యాసాలను ఎత్తిచూపారు. అమరావతిలో కిలోమీటర్ ఫ్లైఓవర్‌కు రూ.170 కోట్లు చూపిస్తుంటే, తన హయాంలో విజయవాడ బెంజ్ సర్కిల్‌లో కేవలం రూ.35 కోట్లతో పూర్తి చేశామన్నారు. ఢిల్లీలోని కొత్త పార్లమెంట్, తెలంగాణ సచివాలయం కన్నా ఏపీ అసెంబ్లీ, హైకోర్టుల నిర్మాణ వ్యయాలు ఎక్కువగా ఉండటాన్ని ఆయన తప్పుపట్టారు.సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ కుటుంబాలు హైదరాబాద్‌లోనే ఉంటున్నాయని, వారు అమరావతికి కేవలం షటిల్ సర్వీస్ చేస్తున్నారని జగన్ ఎద్దేవా చేశారు. 2014 నుంచి ఇప్పటివరకు సుదీర్ఘకాలం పాలనలో ఉన్న చంద్రబాబు అమరావతికి ఏం చేశారని, రైతులకు ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. అమరావతిపై తీర్మానం పేరుతో అసెంబ్లీలో చంద్రబాబు కొత్త డ్రామా ఆడారని, సభను కేవలం తనను, వైసీపీని దూషించడానికి వాడుకున్నారని విమర్శించారు. అమరావతిపై ఉన్న శ్రద్ధ వల్ల విద్యా దీవెన, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని, రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా, కర్నూలును న్యాయ రాజధానిగా చేయాలన్నదే తమ విధానమని పునరుద్ఘాటించారు. తాము అధికారంలోకి వచ్చాక అమరావతి కుంభకోణంపై పూర్తిస్థాయి విచారణ జరిపి, దోషులను శిక్షిస్తామని జగన్ హెచ్చరించారు.

# ఇరాన్ గత పాలకుడి కంటే ఇతను కొంచెం నయం

అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్ కొత్త నాయకత్వం తమతో కాల్పుల విరమణ కోరిందని వెల్లడించారు. అయితే, తాము అందుకు అంగీకరించాలంటే కీలకమైన హర్మూజ్ సముద్ర మార్గంపై తమ షరతులకు ఒప్పుకోవాల్సి ఉంటుందని అన్నారు. అంతవరకు సైనిక ఒత్తిడి కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. బుధవారం సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "గత పాలకుడితో పోల్చితే ఇరాన్ నూతన పాలకుడు (సుప్రీం లీడర్) కొంచెం నయం అనిపిస్తున్నాడు. అతడికి తక్కువ తీవ్రవాద భావజాలం, ఎక్కువ తెలివితేటలు ఉన్నాయి. ఇప్పుడతను అమెరికాతో కాల్పుల విరమణ కోరారు!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిని స్వేచ్ఛగా, సురక్షితంగా తెరిచి ఉంచినప్పుడు మాత్రమే కాల్పుల విరమణ ప్రతిపాదనను పరిశీలిస్తామని ఆయన తేల్చిచెప్పారు. ప్రపంచ ఇంధన రవాణాలో హర్మూజ్ జలసంధి అత్యంత కీలకమైనది కావడంతో కాల్పుల విరమణకు ట్రంప్ ఈ అంశాన్ని ముందుకు తెస్తున్నారు. ఈ షరతులను నెరవేర్చే వరకు ఇరాన్‌పై సైనిక చర్యలను మరింత తీవ్రతరం చేస్తామని ట్రంప్ తన పోస్ట్‌లో హెచ్చరించారు. "మాటవినకుంటే ఇరాన్‌ను నామరూపాల్లేకుండా చేస్తాం లేదా వారు చెప్పినట్లుగా మళ్లీ రాతియుగానికి పంపిస్తాం!" అని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కూడా విలేకరులతో మాట్లాడుతూ, ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు, ఒత్తిడిని కొనసాగించేందుకు తమ బలగాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రవాణాను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# అనిల్ అంబానీ చుట్టూ బిగుసుకుంటున్న ఉచ్చు... తాజాగా కేసు నమోదు చేసిన సీబీఐ

పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ, ఆయన సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) చుట్టూ ఉచ్చు మరింత బిగుస్తోంది. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)కి రూ.3,750 కోట్ల మేర నష్టం కలిగించారన్న ఆరోపణలపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) బుధవారం కేసు నమోదు చేసింది. ఈ కేసులో అనిల్ అంబానీ, ఆర్‌కామ్‌తో పాటు కొందరు గుర్తుతెలియని ప్రభుత్వ ఉద్యోగులు, ఇతరులను నిందితులుగా చేర్చారు.ఎల్ఐసీ చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదు చేసినట్లు సీబీఐ ఒక ప్రకటనలో తెలిపింది. కుట్ర, మోసం, నిధుల దుర్వినియోగం వంటి అభియోగాలతో పాటు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆర్‌కామ్ ఆర్థిక పరిస్థితిపై తప్పుడు సమాచారం ఇచ్చి, ఆస్తులకు మించిన భద్రత ఉందని నమ్మించి, రూ.4,500 కోట్ల విలువైన నాన్–కన్వర్టిబుల్ డిబెంచర్లను (ఎన్‌సీడీ) ఎల్ఐసీకి మోసపూరితంగా అంటగట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బీడీవో ఇండియా ఎల్ఎల్‌పీ అనే సంస్థ 2020 అక్టోబర్ 15న ఇచ్చిన ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికను ఎల్ఐసీ తన ఫిర్యాదుకు ఆధారంగా చూపింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి సేకరించిన నిధులను దుర్వినియోగం చేయడం, అనుబంధ సంస్థల ద్వారా నిధులను దారి మళ్లించడం, నకిలీ బిల్లులతో నిధులు పొందడం వంటి అనేక అక్రమాలకు ఆర్‌కామ్ పాల్పడినట్లు ఆడిట్‌లో తేలింది.ఆర్‌కామ్, అనిల్ అంబానీపై సీబీఐ కేసులు నమోదు చేయడం ఇది మొదటిసారి కాదు. ఇప్పటికే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నేతృత్వంలోని పలు బ్యాంకులను మోసం చేశారన్న ఆరోపణలపై మూడు కేసులు నమోదయ్యాయి. ఎస్‌బీఐకి రూ.2,929.05 కోట్లు నష్టం కలిగించారన్న కేసులో సీబీఐ అధికారులు అనిల్ అంబానీని ఢిల్లీలో రెండు రోజుల పాటు విచారించారు కూడా. ఎస్‌బీఐతో పాటు పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి పలు బ్యాంకులు కూడా ఆర్‌కామ్‌పై ఫిర్యాదులు చేశాయి. ప్రస్తుతం ఈ కేసులన్నింటిపైనా దర్యాప్తు కొనసాగుతోందని సీబీఐ వెల్లడించింది.

# ఇరాన్ మిస్సైళ్లు యూరప్‌ను కూడా తాకగలవు

యూరప్‌లోని సుదూర ప్రాంతాలను సైతం తాకగల క్షిపణులను ఇరాన్ అభివృద్ధి చేసిందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా చేపట్టిన సైనిక చర్యను సమర్థిస్తూ, ఇరాన్ ఆయుధ కార్యక్రమాలతో ప్రపంచానికి పెను ముప్పు ఉందని ఆయన హెచ్చరించారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో రూబియో మాట్లాడుతూ, ఇరాన్ ఇటీవల ప్రయోగించిన క్షిపణులు తమ అంచనాలకు మించిన సామర్థ్యాన్ని ప్రదర్శించాయని తెలిపారు. "ఆ క్షిపణులు యూరప్‌లోని చాలా ప్రాంతాలకు చేరగలవు" అని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో అమెరికా ప్రధాన భూభాగాన్ని కూడా లక్ష్యంగా చేసుకునే దీర్ఘశ్రేణి క్షిపణుల తయారీకి ఇరాన్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇరాన్ క్షిపణి, అణు కార్యక్రమాలను వేర్వేరుగా చూడలేమని రూబియో స్పష్టం చేశారు. "ఇరాన్ ఇప్పటికే 60 శాతం స్వచ్ఛతతో యురేనియంను శుద్ధి చేసింది. కేవలం 12 నుంచి 14 రోజుల్లోనే దాన్ని 90 శాతం స్వచ్ఛతకు (అణుబాంబు తయారీకి అవసరమైన స్థాయి) చేర్చగలదు. అణుబాంబులో ఉపయోగించడానికి తప్ప 60 శాతం శుద్ధి చేసిన యురేనియం వల్ల మరో ప్రయోజనం ఉండదు" అని ఆయన వివరించారు. ఇరాన్ తన అణు కార్యక్రమానికి రక్షణ కవచంగా అత్యాధునిక ఆయుధాలను సమకూర్చుకోకుండా నిరోధించేందుకే సైనిక చర్య ప్రారంభించామని రూబియో తెలిపారు. ఇరాన్ వాయుసేన, నౌకాదళాన్ని ధ్వంసం చేయడం, క్షిపణి లాంచర్లను నిర్వీర్యం చేయడం, డ్రోన్లు, క్షిపణుల తయారీ ఫ్యాక్టరీలను ధ్వంసం చేయడం వంటి నాలుగు లక్ష్యాలతో ఈ ఆపరేషన్ సాగుతోందని చెప్పారు. "ఈ లక్ష్యాల సాధనలో మేము అనుకున్నదానికంటే వేగంగా ఉన్నాం. లక్ష్యానికి చాలా దగ్గరగా ఉన్నాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సైనిక చర్య కొనసాగుతున్నప్పటికీ, చర్చల ద్వారాలు తెరిచే ఉన్నాయని, ఇరుపక్షాల మధ్య సందేశాలు మార్పిడి జరుగుతున్నాయని రూబియో అన్నారు. అయితే, చర్చల పేరుతో కాలయాపన చేయడాన్ని సహించబోమని, దొంగచాటు చర్చలకు అంగీకరించబోమని స్పష్టం చేశారు. హర్మూజ్ జలసంధిలో నౌకల రవాణాకు ఇరాన్ ఆటంకం కలిగిస్తే అది అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు నష్టం కలుగుతుందని హెచ్చరించారు.

# ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణం.. పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

భాగంగా జరిగే ఈ కల్యాణ వేడుకకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు హాజరయ్యారు. భక్తుల సౌకర్యార్థం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కల్యాణ వేడుక భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని పంచింది.ఈ వేడుకలో చంద్రబాబు, భువనేశ్వరి దంపతులతో పాటు మనవడు నారా దేవాన్ష్ కూడా పాల్గొన్నాడు.

# ఏపీ ప్రజలకు అభినందనలు.. కానీ మా సంగతేంటి?

- మొదటి పేజి తరువాయి

అమలులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం–2014లో తెలంగాణకు పలు కీలక హామీలు ఉన్నాయని, వాటి అమలు విషయంలో కేంద్రం వివక్షపూరితంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు.బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం, సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా వంటి కీలక ప్రాజెక్టులు ఇంకా ఆచరణకు నోచుకోలేదని అన్నారు. ఈ ప్రాజెక్టులు తెలంగాణ అభివృద్ధికి కీలకమని గుర్తుచేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటి అంశాల్లో కూడా కేంద్రం మాట తప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఒక రాష్ట్రానికి చట్టబద్ధతతో ముందుకు తీసుకెళ్లే చర్యలు తీసుకుంటూ, మరో రాష్ట్రానికి ఇచ్చిన హామీలను విస్మరించడం సరైనది కాదని మంత్రి అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ విభజన చట్టంలో పొందుపరిచిన అన్ని హామీలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# జగన్ వ్యాఖ్యలన్నీ అబద్ధాలే.. అమరావతిపై మంత్రి నారాయణ సమగ్ర వివరణ

మాజీ ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమరావతి నిర్మాణ ఖర్చులు, ఇతర అంశాలపై జగన్ చెబుతున్నవన్నీ పచ్చి అబద్ధాలని, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఆయన పదేపదే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఢిల్లీలో తాను స్వయంగా అధికారులతో మాట్లాడి వాస్తవాలు తెలుసుకున్నానని, జగన్ మాత్రం నోటికి వచ్చిన లెక్కలు చెబుతున్నారని విమర్శించారు.

**అమరావతికి తిరుగులేని చట్టబద్ధత**

అమరావతి రాజధాని విషయంలో జగన్ ఇకపై ఎలాంటి గందరగోళం సృష్టించలేరని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం–2014కు కీలక సవరణ చేసిందని, సెక్షన్ 5, సబ్–సెక్షన్ 2లో అమరావతి రాజధాని ప్రాంతాన్ని (217 చదరపు కిలోమీటర్లు) స్పష్టంగా నిర్వచించిందని తెలిపారు. ఈ చట్టసవరణతో రాజధానిపై పూర్తిస్థాయి స్పష్టత వచ్చిందని, ఇది రాష్ట్ర ప్రజలకు శుభవార్త అని అన్నారు. గతంలో జగన్ ఆడిన "మూడు ముక్కలాట"కు ఈ సవరణతో తెరపడిందని, ఇకపై ఆయన ఎన్ని వేషాలు వేసినా చెల్లవని వ్యాఖ్యానించారు.

**ప్రజాధనంతో కాదు.. ల్యాండ్ పూలింగ్‌తోనే నిర్మాణం**

అమరావతి నిర్మాణానికి రూ. 2 లక్షల కోట్లు అవుతుందని జగన్ చెప్పడం హాస్యాస్పదమని మంత్రి నారాయణ కొట్టిపారేశారు. ప్రజాధనం నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండానే రాజధాని నిర్మాణం జరుగుతుందని పునరుద్ఘాటించారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకొచ్చిన ల్యాండ్ పూలింగ్ విధానమే దీనికి ఆధారం. రైతుల నుంచి సమీకరించిన భూమిని అభివృద్ధి చేసి, వారికి కొంత వాటా ఇచ్చాక మిగిలిన ప్రభుత్వ భూమిని అమ్మి, ఆ డబ్బుతోనే నిర్మాణాలు చేపడతాం. దీనికోసం ప్రస్తుతం బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటాం. ప్రభుత్వం వద్ద సుమారు 5,000 ఎకరాలకు పైగా భూమి ఉంది. భవిష్యత్తులో దీని విలువ పెరిగాక అమ్మితే, ఆ డబ్బుతో అప్పులు తీర్చడమే కాకుండా, రాష్ట్రానికి అదనపు ఆదాయం కూడా వస్తుంది" అని ఆయన వివరించారు.

**ఆర్థిక వృద్ధి కేంద్రంగా అమరావతి**

అమరావతి కేవలం పరిపాలనా రాజధాని కాదని, రాష్ట్రానికి ఒక ఆర్థిక చోదక శక్తి (ఎకనామిక్ గ్రోత్ ఇంజిన్)గా మారబోతోందని నారాయణ ధీమా వ్యక్తం చేశారు. "ఈరోజు తెలంగాణ రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో 70 శాతం ఒక్క హైదరాబాద్ నుంచే వస్తోంది. అదేవిధంగా కర్ణాటకకు బెంగళూరు, తమిళనాడుకు చెన్నై, మహారాష్ట్రకు ముంబై ఆర్థిక కేంద్రాలుగా ఉన్నాయి. ఆ నగరాల నుంచి వచ్చే ఆదాయాన్ని మిగతా జిల్లాల అభివృద్ధికి పంచుతున్నారు. అదే దూరదృష్టితో చంద్రబాబు అమరావతిని నిర్మిస్తున్నారు" అని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం వంటివి నిర్మించడం ద్వారా పర్యాటకం, హోటల్ రంగం అభివృద్ధి చెంది, వేలాది మందికి ఉపాధి లభిస్తుందని అన్నారు.

**2028 ఆగస్టు డెడ్‌లైన్**

ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో రూపొందించిన ప్రణాళిక ప్రకారం పనులు వేగంగా జరుగుతాయని, 2028 ఆగస్టు నాటికి అమరావతిని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని నారాయణ స్పష్టం చేశారు. కొన్ని భవనాలు ఇప్పటికే పూర్తయ్యాయని, దశలవారీగా మిగతా పనులు కూడా పూర్తవుతాయని చెప్పారు. తాము ప్రజల కోసం రాజధాని కడుతుంటే, జగన్ మాత్రం తన బొమ్మను సర్వే రాళ్లపై వేసుకోవడానికి రూ.750 కోట్లు, హైదరాబాద్, వైజాగ్‌లలో ప్రజాధనంతో ప్యాలెస్‌లు కట్టుకున్నారని తీవ్రంగా ఆరోపించారు.గత ఐదేళ్లలో రాజధాని కోసం భూములిచ్చిన రైతులను జగన్ ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులను మంత్రి గుర్తుచేశారు. మహిళలని కూడా చూడకుండా బూటుకాళ్లతో తన్నారని, లాఠీఛార్జీలు చేసి, ఫెన్సింగ్ వేసి నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల త్యాగాలకు, పోరాటానికి ఈరోజు చట్టసవరణతో న్యాయం జరిగిందని, ఇక రాష్ట్ర ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక

## రాష్ట్రంలో ముందంజలో డా.బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 1 :**ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా సమస్యల పరిష్కార ప్రక్రియలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాష్ట్రంలో ముం దంజలో నిలవడం మనందరికీ గర్వకారణమని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు ఈ ఘనత సాధించడంలో జిల్లా యంత్రాంగం, ముఖ్యంగా జిల్లా స్థాయి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది చేసిన కృషి అనిర్వచనీయమ న్నారు అర్జీలపట్ల మీరు చూపిన అంకితభావం, పారదర్శకత, శ్రద్ధ వల్లే ఈ విజయం సాధ్యమైంద న్నారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, కోనసీమ జిల్లా పేరును మరిన్ని శిఖరాలకు తీసుకెళ్తారని ఆశిస్తున్నానన్నారు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా సమస్యల పరిష్కారంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవడం జిల్లా అధికారులు సిబ్బంది పనితీరుకు గీటురాయిగా నిలుస్తుందన్నారు రాష్ట్రంలో కోనసీమ జిల్లా 88.74 శాతంతో అర్జీల పట్ల పరిష్కారం చూపుతూ ముందంజలో నిలిచిందన్నారు. అదేవిధంగా ప్రజా సంతృప్తి స్థాయిలను పరిశీలించగా 5 మార్కులకు గాను 3. 54 మార్కులను సాధించి ముందు వరుసలో నిలిచిందన్నారు అర్జీదా రులతో నేరుగా ముచ్చటిస్తూ కోనసీమ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మీరు అందించిన వినతులను వేగంగా, నాణ్య తతో పరిష్కరించ డం వల్ల నేడు కోనసీమ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఈ విజయం మాపై మరింత బాధ్యతను పెంచిందని అర్జీదారులను ఉద్దేశించి అన్నారు మీ సమస్య ఏదైనాసరే, అది మా దృష్టికి వచ్చినప్పుడు దానికి సరైన పరిష్కారం లభించేలా మేము ఎల్ల ప్పుడూ కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ సేవలను మీకు మరింత చేరువ చేయడమే మా లక్ష్యంమని మాపై నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించ డంలో డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాష్ట్రంలో ముందంజలో నిలవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు ఈ విజయానికి జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ వారి నాయకత్వం, అధికారుల కృషి మరియు ప్రజలతో నేరుగా ముచ్చటిస్తూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే తపన ప్రధాన కారణమన్నారు. జిల్లా స్థాయి అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించ డానికి చూపిన అంకితభావం ప్రశంసనీయమైనదన్నారు. ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించి జిల్లాను రాష్ట్రంలో ముందం జలో నిలిపినందుకు జిల్లా స్థాయి అధికారులందరికీ హృద యపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానన్నారు.ఇదే స్ఫూర్తితో భవిష్యత్తు లో కూడా ప్రజలకు మరింత ఉత్తమ సేవలు అందిస్తూ జిల్లాను మరిన్ని విజయాల దిశగా నడిపించాలని ఆకాంక్షించారు. ముందంజలో నిలవడానికి అధికారులు చేసిన అసాధారణ కృషి జిల్లా ప్రజలకు గొప్ప ఆశీర్వాదమన్నారు. మీ అందరి సహకారం కొనసాగాలని, ఇ లాంటి చర్యలతో జిల్లా అభి వృద్ధికి మరింత దోహ దపడాలని కోరుకుంటున్నానన్నారు.

# పెన్ పవర్

కాకినాడ

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# వైభవంగా అయ్యప్ప స్వామి "ఆరాట్టు" మహోత్సవం

**శరణు ఘోషలతో మారుమోగిన గోదావరి తీరం**



**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 01;**శబరిమల పంబా నదిలో నిర్వహించే అయ్యప్ప స్వామి ఆరాట్టు మహోత్సవం మాదిరిగానే గోదావరి జిల్లాల్లో తొలిసారిగా అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం బడుగువానిలంక గోదావరి చెంతన ఎంతో వైభవంగా నిర్వహించారు. బుధవారం అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని వేలాది మందితో ఊరేగింపుగా గౌతమీ నదీ తీరానికి తీసుకెళ్ళి ఈ ఆరాట్టు కార్యక్రమం కన్నులపండువగా జరిపించారు. కడియంకు చెందిన తాడాల వీర వెంకటరావు గురుస్వామి ఆధ్వర్యంలో విస్సు మాల ధరించిన అయ్యప్ప స్వామి భక్త బృందం ఈ ఆరాట్టు నిర్వహించారు.కేరళా వాయిద్యాలు, బాణాసంచా కాల్పుల మధ్య ఉత్సవ విగ్రహాలతో అయ్యప్ప స్వాములు, కలశాలతో మహిళలు నిర్వహించిన గ్రామోత్సవం అత్యంత వైభవంగా సాగింది. అయ్యప్ప స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని గుర్రపు బగ్గీ పై ఊరేగించారు. ఊరేగింపుగా గోదావరి చెంతకు చేరుకుని స్వామి వారికి గోదావరి జలంతో వేదమంత్రాల మధ్య అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అయ్యప్ప స్వామి వారి సేవలో కొంతసేపు గడిపారు. వేద పండితులు ఆయనకు స్వామివారి ఆశీస్సులు అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంబా నదీలో జరిగే ఆరాట్టు ఉత్సవం అదే తరహాలో బడుగువానిలంకలో నిర్వహించడం అందులో తాను పాల్గోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇంత అద్భుతమైన కార్యక్రమం నిర్వహించిన అయ్యప్ప స్వాములను, గ్రామస్తులను,దాతలను ఎమ్మెల్యే అభినందించారు. అలాగే రావులపాలెం రూరల్ సీఐ సిహెచ్ విద్యాసాగర్ పద్మ దంపతులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.ఆలమూరు ఎస్సై జి.నరేష్ ఆధ్వర్యంలో గోదావరి నది వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు. అనంతరం గ్రామంలో వేలాది మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఆలమూరు, కడియం,మండపేట,రావులపాలెం మండలాల నుండి అయ్యప్ప స్వామి భక్తులు,గురు స్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కొసరాజు వెంకట సుబ్బారావు కు మాజీ మంత్రి ముద్రగడ పరామర్శ.



**కిర్లంపూడి, పెన్ పవర్, ఏప్రియల్ 01:** కోసరాజు వెంకట సుబ్బారావుకు మాజీ మంత్రి, రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం పరామర్శించారు. కొసరాజు వెంకట సుబ్బారావు ధర్మపత్ని శ్రీమతి కోసరాజు మాధవి రాణి ఇటీవలే స్వర్గస్తులైనారు. బుధవారం వారి పెద్దకర్మ సందర్భంగా , ముద్రగడ పద్మనాభం విజయవాడ మంగళగిరిలోని వెంకట సుబ్బారావు నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మాధవి రాణి మృతి పట్ల తన తీవ్ర ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.ఈ కష్ట సమయంలో వెంకట సుబ్బారావు, వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని కోరుకుని మాధవి రాణి గారి ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిచారు.ఆయన వెంట ప్రముఖ పారిశ్రామికవేత్త గణేశుల రాంబాబు, జగపతినగరం మాజీ సర్పంచ్, పెంటకోట నాగబాబు, వైసిపి నాయకులు గౌతు స్వామి, తదితరులు ఉన్నారు.

# జనార్ధన స్వామి సేవలో రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్ దంపతులు




**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 01;**ఐదు వేల ఏళ్ల నాటి అతి పురాతనమైన నారద మహర్షి చేత ప్రతిష్టమైన ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి వారి ఆలయాన్ని రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్ దంపతులు బుధవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, పాలకమండలి సభ్యులు, ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అనంతరం విద్యాసాగర్ దంపతులు స్వామివారిని దర్శించుకున్న ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి ప్రభాకరాచార్యులు, అంగర భగవానాచార్యులు స్వామివారి విశిష్టత గురించి విద్యాసాగర్ దంపతులకు తెలియజేశారు. అనంతరం స్వామి వారి శేష వస్త్రాన్ని అందించి, వేదాశీర్వచనం చేశారు. అతి పురాతనమైన జనార్ధన స్వామి వారి ఆలయాన్ని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఈ సందర్భంగా సిఐ విద్యాసాగర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో చింతలూరు నీటి సంఘం అధ్యక్షులు గారపాటి శ్రీనివాస్, చింతలూరు సొసైటీ అధ్యక్షులు నల్లా వెంకన్న, ద్విభాష్యం సుబ్బలక్ష్మి, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# దాడి రాజగోపాల్ విందు కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ రాజకీయ నాయకులు.



**కాకినాడ జిల్లా కిర్లంపూడి ఏప్రియల్ 01:** కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడి గ్రామానికి చెందిన దాడి రాజగోపాల్ (రాజా) కార్యాలయంలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్ తోట నరసింహంతో పాటు జగ్గంపేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత తోట నవీన్ కుమారుడు తోట వరుణ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాడి రాజగోపాల్ ఏర్పాటుచేసిన విందు కార్యక్రమంలో పాల్గొని రాజగోపాల్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరకణం రాజబాబు. కిర్లంపూడి వాకర్స్ క్లబ్ అధ్యక్షులు, జిల్లా యాదవ సంక్షేమ సంఘం నాయకులు నైదాన బాబ్జి,శరకణం తాతాజీ కిర్లంపూడి మండలం విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు గానుగల శ్రీనివాసరావు,కిర్లంపూడి వైస్ ఎంపీపీ బొద్దేటి గణపతి,మళ్ల నాగు,దాడి పెద్దబుజ్జి, యల్లపు నానాజీ, శరణం సంతోష్,సంగన వెంకటేశ్వరరావు,ఆడిటర్,, ఆడారి శ్రీను,ఆడారి గంగబాబు,కిర్లంపూడి, చిల్లంగి,జగపతినగరం గ్రామాలకు చెందిన పలువురు గ్రామపెద్దలు రాజా అభిమానులు పాల్గొన్నారు.



# పేదల కళ్ళల్లో ఆనందం చూడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.



**నియోజకవర్గ వ్యాప్తంగా లబ్ధిదారులకు రూ.18.29కోట్ల పంపిణీ.**

**కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.**

**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 01;**పేదల కళ్ళల్లో ఆనందం చూడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతీ నెలా ఒకటో తేదీన పింఛన్లను అందించడం, ఒకటో తేదీన సెలవు అయితే అంతకు ముందు రోజే పింఛన్లను అందించడం జరుగుతుందన్నారు. ఆలమూరు మండలం నర్సిపూడిలో బుధవారం ఆయన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎక్కడ ఏ విధమైన లోటు లేకుండా పింఛన్లను అందిస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.3వేల పింఛను రూ.4వేలకు దివ్యాంగుల పింఛను రూ.6000, మిగిలినవారికి సైతం రూ.10వేలు, రూ.15వేల వరకూ కూటమి ప్రభుత్వం పెన్షన్లను పెంచిందన్నారు. స్పౌజ్ పింఛన్లు వెంటనే అందించడం జరుగుతుందన్నారు. ఎన్నికల ముందు వాలంటీర్లు లేకుండా పింఛన్లను లబ్ధిదారులకు అందించడం అసాధ్యం అంటూ దుష్ప్రచారం చేశారని,అయితే వాలంటీర్లవ్యవస్థతో సంబంధం లేకుండా ఒకటవ తేదీ మధ్యాహ్నంలోపే లబ్ధిదారులందరికీ పింఛన్లను విజయవంతంగా అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఏటా 33 వేల కోట్ల రూపాయలను పింఛన్ల కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. నాలుగు మండలాల్లో 57 గ్రామాలకు చెందిన 42వేల మందికి రూ.18.29కోట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. పింఛన్ల పంపిణీలో పాల్గొనడం అంటే పేదల సేవలో పాల్గొనడమే అని పేర్కొన్నారు. 60 ఏళ్లు పైబడిన వారికి వృద్ధాప్య పింఛన్లను త్వరలోనే అందిస్తారని తెలిపారు. ప్రజల్ని కలుసుకొని పింఛన్లను అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు.తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నందుకు వారందరినీ అభినందిస్తున్నానన్నారు. ప్రభుత్వ అధికారులను, ఉద్యోగులను పేదల కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు అభినందిస్తున్నానన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

క్లాసిఫైడ్ యాడ్స్

కేవలం

యాడ్ 100/-కే

' ఐదు రోజులకు '


'4 సెం.మీ 4 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '


93948 55244


షరతులు వర్తిస్తాయి



# వాడపల్లి వెంకన్న తెప్పోత్సవం



**గౌతమీ గోదావరి నదిలో శ్రీదేవి భూదేవి తో శ్రీవారు విహారం**







**ఆత్రేయపురం పెన్ పవర్, ఏప్రిల్ 1:**కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య కళ్యాణోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు బుధవారం కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేకువజామున మేలుకొలువు సేవతో ప్రారంభమైన కార్యక్రమాలుజరిగాయి . ఆలయ ప్రధాన పండితులు ఖండ వల్లి వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో తీర్ధ బిందె, విశేషార్చన, నిత్య హోమం, బలిహరణం, నీరాజన, మంత్రపుష్పాలతో వైభవంగా సాగాయి.సాయంత్రం ప్రధాన హోమం, బలిహరణ అనంతరం గౌతమి గోదావరిలో నిర్వహించిన తెప్పోత్సవం భక్తులను అలరించింది. స్వామివారు అలంకరించిన తెప్పలో విహరిస్తూ దర్శనమిచ్చిన వేళ భక్తులు హర్షధ్వానాలతో స్వాగతం పలికారు.ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు సలాది నాగేశ్వరరావు, చలుమూరి రాంబాబు, తమ్మన సాయిప్రసాద్, సిస్ట కుటుంబరావు, మసకపల్లి త్రిమూర్తులు, సరేళ్ల సరిత, చింతపల్లి సత్యనారాయణ, వాడపల్లి సుందర శేషావతారం తదితరులు పాల్గొన్నారు.అలాగే రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు, ఆలయ సిబ్బంది, అర్చకులు, గ్రామస్తులు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు.

# కొత్తపేట అభివృద్ధి చూసి వైసీపీ ఆందోళన -- టిడిపి ఆరోపణలు



**కొత్తపేట,పెన్ పవర్, ఏప్రిల్ 1:**రాష్ట్రానికి రాజధాని లేకుండా ఉండాలని వైసీపీ ప్రయత్నిస్తున్నదని జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి విమర్శించారు. అమరావతి రాజధాని చట్టబద్ధత కోసం లోక్ సభలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు వ్యతిరేకంగా వైసీపీ నిలవడం ద్వారా ఆ పార్టీ అసలు ఉద్దేశం బయటపడిందన్నారు.

దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు అమరావతికి మద్దతు ఇస్తున్న సమయంలో వైసీపీ వ్యతిరేకించడం ఆపార్టీ దివాళాదశను సూచిస్తోందని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రగతి,కొత్తపేట నియోజకవర్గ అభివృద్ధి నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే వైసీపీ నేత చిర్ల జగ్గిరెడ్డి అవినీతి ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిని పక్కనపెట్టి,ప్రస్తుత ఎమ్మెల్యే బండారు సత్యానందరావుపై నిందలు మోపడం సరైంది కాదన్నారు.ప్రతి నెల ఒకరోజు సమావేశం నిర్వహించి ఆరోపణలు చేయడం,తర్వాత వాటిపై స్పందించకుండా మౌనం వహించడం జగ్గిరెడ్డి అలవాటుగా మారిందని విమర్శించారు.అక్రమఇసుక,మట్టి,మద్యం వ్యవహారాల్లో పాల్గొన్న వారే ఇప్పుడు అవినీతి గురించి మాట్లాడటం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు.

వైసీపీ పాలనలో ఐదేళ్లపాటు కొత్తపేట నియోజకవర్గంలో రహదారులు,సాగునీటి ప్రాజెక్టులు,దేవాలయ పర్యాటకం వంటి అంశాలను పట్టించుకోలేదని బాబ్జి ఆరోపించారు.అయితే గత 20 నెలల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు.

ప్రతి ప్రాంతం అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటూ ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధుల కృషిని ప్రజలే గమనిస్తున్నారని అన్నారు.వైసీపీ కార్యకర్తలను కాపాడుకునేందుకు అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని జగ్గిరెడ్డికి సూచించారు.

# పింఛన్లు పంపిణీ చేసి... గ్రామంలో సిమెంట్ రోడ్లు నిర్మాణాన్ని పరిశీలించిన

- రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు





**గండేపల్లి,పెన్ పవర్, ఏప్రిల్ 1** ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ల నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం పేదల సేవలో ముందుందని రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు అన్నారు. ప్రతీ నెలా ఒకటో తేదీన పింఛన్లను అందించడం, ఒకటో తేదీన సెలవు అయితే అంతకు ముందు రోజే పింఛన్లను అందించడం వారి నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. గండేపల్లి మండలం సింగరం పాలెంలో బుధవారం ఆయన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.దేశంలో అధికంగా పింఛన్లు ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు. వృద్ధులకురూ.4వేలు, దివ్యాంగులకు 6000, 10000, 15000 పింఛను అందిస్తున్న ఏకైక రాష్ట్రం మనదన్నారు. ప్రభుత్వ పరంగా పేదవర్గాలకు నేరుగా నగదు అందిస్తున్న అతి పెద్ద కార్యక్రమం దేశంలో ఇదేనని అన్నారు. ఈనాడు పింఛన్లు అందుకున్న ప్రతీ ఒక్కరి కళ్లలో ఆనందం కనపడుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పింఛన్లను పెంచడం జరిగిందన్నారు. రూ.3వేల పింఛను రూ.4వేలకు పెంచడం జరిగిందన్నారు. దివ్యాంగుల పింఛను రూ.6000, మిగిలినవారికి సైతం రూ.10వేలు, రూ.15వేల వరకూ పెంచిన ఘనత ముఖ్యమంత్రి కే దక్కుతుందన్నారు. స్పౌజ్ పింఛన్లు వెంటనే అందించడం జరుగుతుందన్నారు. పింఛన్ల పంపిణీ పారదర్శంగా జరుగుతుందని లబ్ధిదారులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో నిర్మాణం అవుతున్న సిమెంట్ రోడ్లను పరిశీలించి ఎక్కడ రాజీ లేకుండా రోడ్ల నిర్మాణం జరగాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అక్కిన నాగేశ్వరరావు, అక్కిన సుదర్శన్ రావు, ఏ బుల్లి దొర, కే రమేష్, చంద్ర రావు, బాబ్జి, కొండ, రమేష్, రామకృష్ణ, రాజా, చంటి తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ దారుల ముఖాల్లో చిరునవ్వులు -- ఎన్టీఆర్ భరోసా పంపిణీతో ఆనందం

**కొత్తపేట,పెన్ పవర్, ఏప్రిల్ 1;**కూటమి ప్రభుత్వం ప్రతినెల అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ద్వారా లబ్ధిదారుల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని టిడిపి సీనియర్ నాయకులు గుబ్బల మూర్తి పేర్కొన్నారు.పెన్షన్ పంపిణీ సమయంలో లబ్ధిదారుల కళ్లల్లో కనిపిస్తున్న ఆనందం ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమని తెలిపారు. ప్రతినెల నిర్వహించే పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ అందజేస్తున్నామని చెప్పారు. ఈ విధానం ద్వారా వృద్ధులు,వికలాంగులు వంటి లబ్ధిదారులకు సౌకర్యం కలుగుతుందని వివరించారు.

పెన్షన్ పంపిణీలో నాయకులు పాల్గొనడంపై కొంతమంది వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలను ఆయన ఖండించారు.అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యం ప్రజల ముంగట పరిపాలన జరగాలని,ప్రజల వద్దకే సేవలు చేరాలనే ఉద్దేశంతో ఈ విధానాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు.అలాగే ప్రతినెల లబ్ధిదారులను కలుసుకుని వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడానికే నాయకులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతున్నారని చెప్పారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపుతో మూడవ వార్డులో సచివాలయ సిబ్బందితో కలిసి పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నామని గుబ్బల మూర్తి వివరించారు.ఈ కార్యక్రమంలో మట్టా బాలు, బండి రాజీవ్, పెనిపే ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.





## ఇస్తారాజ్యం.. కాంట్రాక్టర్ ఆగడాలతో రోగులు ఇక్కట్లు

### పది రోజులుగా భోజనాలు లేక రోగులు విల విల

**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ ,1:**అనే వార్తకు జిల్లా అధికారులు స్పందించినట్లు విశ్వసనీయ సమాచారం. కలెక్టర్ వారి కార్యాలయం నుండి స్థానిక సూపర్డెంట్ ప్రణీత్ కు ఫోన్ ద్వారా వివరణ కోరినట్లు సమాచారం. అయితే వారు కోరిన విధంగా సూపర్డెంట్ మెయిల్ ద్వారా పత్రం అందించినట్లు సమాచారం. పత్రంలో గ్యాస్ లేని కారణంగా రోగులకు కాంట్రాక్టర్ భోజనాలను అందవలన్నట్లు తెలుపుతూ అలాగే ఏప్రిల్ 2 3 తేదీలలో తిరిగి ప్రారంభిస్తున్నట్లు కాంట్రాక్టర్ చెప్పినట్లు సూపర్డెంట్ ప్రణీత్ వివరణ ఇచ్చినట్లు తెలుస్తుంది.

# కోనసీమ తిరుమల వాడపల్లి లో భక్తుల రద్దీ

### స్వామివారి అన్నదాన కార్యక్రమానికి భక్తులు విరాళం





**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 1:**కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి తెలుగు రాష్ట్రాల నుండి భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. భక్తులు స్వామివారి నిలువెత్తు దర్శనం చేసుకుని పెద్ద ప్రసాదాలు స్వీకరిస్తున్నారు.బుధవారం స్వామివారి సన్నిధిలో ఆలయ అర్చకులు విశిష్ట పూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇదే సందర్భంగా ఆలయంలో నిర్వహించే అన్నదానం కార్యక్రమానికి ఆలమూరు గ్రామానికి చెందిన వెత్సా ప్రకాషరావు, అనంత లక్ష్మీ కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళంగా సమర్పించారు. వీరిని ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

# అధికారులు సమన్వయం తోప్రజా సమస్యలను పరిష్కరించాలి






**-ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ**

**అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 1:**కూటమి ప్రభుత్వం ప్రజా పభుత్వంగా పాలనసాగిస్తుమదని

ప్రజా సమస్యలను అధికారులు సమన్వయం తో సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నియోజకవర్గ పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వివిధ శాఖలకు చెందిన అధికారులు మాట్లాడి, శాఖల అభివృద్ధి కోసం తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారని అలాగే సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. పదవీకాలం ముగించుకోబోతున్న అంబాజీపేట మండల సర్పంచులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామాభివృద్ధికి అహర్నిశలు కష్టపడి చేసిన సేవలకు తగిన గుర్తింపు తప్పకుండా లభిస్తుందని అన్నారు. అభివృద్ధి లో తృప్తి, అసంతృప్తి ఉండటం సహజమని, అయినప్పటికీ అందరూ గ్రామాల అభివృద్ధికి చేసిన కృషి ప్రశంసనీయం అని తెలిపారు.

కార్యక్రమం అనంతరం మండల ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో సర్పంచులను ఘనంగా సన్మానించారు. అదే విధంగా శాసనసభ్యులను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, ఎమ్మార్వో, ఎండిఓ, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బట్టు పండు కుటుంబానికి అండగా జనసేన పార్టీ



**5 లక్షల ఉద్యమి ప్రమాద బీమా అందచేత**

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 1:**గతేడాది రోడ్డు ప్రమాదంలో మరణించిన జనసేన పార్టీ అమలాపురం నియోజకవర్గ నిస్వార్థ జనసైనికుడు, రాష్ట్ర చేనేత వికాస విభాగం దివంగత ప్రధాన కార్యదర్శి బట్టు నాగ పుల్లేశ్వర రావు (పండు) కుటుంబానికి జనసేన పార్టీ భరోసాగా నిలిచింది. పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మక నిర్ణయంతో ఏర్పాటు చేసిన ప్రమాద బీమా 5 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ చెక్కును ప్రభుత్వ విప్ మరియు శాసన మండలి సభ్యులు పిడుగు హరిప్రసాద్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కే కే చేతుల మీదుగా వారి కుటుంబానికి అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా హరి ప్రసాద్ బట్టు పండు పార్టీకి అందించిన సేవలను గుర్తు చేసుకుని, వారి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరించి, వారికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హ్యాండీ క్రాఫ్ట్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్డీఎస్ ప్రసాద్, సీనియర్ నాయకులు, సాధక్ లింగోలు పండు పాల్గొన్నారు.

# పరిశుభ్రత, ఆరోగ్యం గ్రామాలలో స్వచ్ఛ రథం

**అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 1:**పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే సంకల్పంతో ప్రభుత్వం ఇంటింటికి ప్రజలకు అందుబాటులో స్వచ్ఛ రథం పేరుతో గ్రామలను పరి శుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో స్వచ్ఛ రథం పథకాన్ని ప్రారంభించడం జరిగిందని పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మండల పరిత్ కార్యాలయంలో స్వచ్ఛ రథం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గృహణిలు వాడిన ప్లాస్టిక్ పరికరాలను ఇచ్చి నిత్యవసరకులను తీసుకొనవచ్చునని దీని ద్వారా స్వచ్ఛాంధ్రప్రదేశ్ గా ఆంధ్రప్రదేశ్ ఉంటుందని గ్రామ స్వచ్ఛతకు ప్రాధాన్యతనిస్తూ “స్వచ్ఛ రథం”అని అన్నారు.

గ్రామాలలో పరిశుభ్రత, పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.పిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర నీటిపారుల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ అరిగెల సూరిబాబు, తహశీల్దారు చినబాబు, ఎంపిడిఓ బి.మమత, నాయకులు నాగాబత్తుల శాంతకుమారి సుబ్బారావు, నేతల నాగరాజు, మైపాల తాతాజీ, మంద రాజేష్ తదితరులు పాల్గొన్నారు.




# రాజధాని అమరావతిపై జగన్ వ్యాఖ్యలు రాష్ట్రానికి చేటు




పత్రికా విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

**కాకినాడ, పెన్ పవర్ ఏప్రిల్ 1:** రాజధాని అంశంపై మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర అభివృద్ధికి చేటు చేసే విధంగా ఉన్నాయని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనవాడి కొండబాబు విమర్శించారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్ చంద్రబాబు నాయుడు అమరావతిని రాజధానిగా నిర్ణయించిన విషయం గుర్తు చేశారు. అనంతరం జగన్ ప్రభుత్వం మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకువచ్చిందని పేర్కొన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి అమరావతినే రాజధానిగా కొనసాగించాలని అసెంబ్లీలో తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ విషయంలో కూటమి భాగస్వామ్య పార్టీల అభిప్రాయాలను సమన్వయం చేసి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.

అమరావతి రాజధాని బిల్లు పార్లమెంట్‌లో ఉన్న సమయంలో జగన్ ప్రెస్‌మీట్ నిర్వహించి అనవసర వ్యాఖ్యలు చేయడం తగదని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి పట్ల ఆయనకు ఆసక్తి లేనట్లుగా కనిపిస్తోందని అన్నారు.కూటమి ప్రభుత్వం హయంలో రాష్ట్రానికి గూగుల్, స్టీల్ ప్లాంట్ వంటి పెద్ద ప్రాజెక్టులతో పాటు దాదాపు 1000 పరిశ్రమల ఏర్పాటు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. జగన్ పార్టీ లోపల నేతలు, కార్యకర్తల అభిప్రాయాలను తీసుకునే అలవాటు లేదని విమర్శించారు.ఇటీవల మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు మధ్య పోర్ట్ సిటీ ఏర్పాటు చేసి దానిని రాజధానిగా మార్చాలనే ప్రతిపాదనపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రంపై నిజమైన అభిమానం ఉంటే అసెంబ్లీలో రాజధాని చర్చ సమయంలో ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు.దేశం 2047 నాటికి అగ్రస్థానంలో నిలిచేలా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని చంద్రబాబు కృషి చేస్తున్న సమయంలో, జగన్ విమర్శలు మానుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ కాకినాడ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## ఏఎంసి వైస్ చైర్మన్ కంఠంశెట్టి కి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే ఆనందరావు



**కొత్తపేట,పెన్ పవర్,ఏప్రిల్ 1:**రావులపాలెంలో మంగళవారం జరిగిన కొత్తపేట అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కాలేకపోయిన అమలాపురం ఎమ్మెల్యే అయిత బత్తుల ఆనందరావు ఆయనతోపాటు అమలాపురం అర్బన్ రూరల్ డెవలప్మెంట్ (అముడా) చైర్మన్ అల్లాడి స్వామి నాయుడు (సోంబాబు) ఏ ఎం సి వైస్ చైర్మన్ కంఠంశెట్టి శ్రీనివాసరావు స్వగ్రామానికి విచ్చేసి ప్రత్యేక అభినందనలు తెలిపారు.అమలాపురం నియోజకవర్గం లో కార్యక్రమాలుకు హాజరు కావడం వలన సమయం సరిపోక నిన్న జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాలేకపోయానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.కంఠంశెట్టి శ్రీనివాసరావు స్వగ్రామానికి కొత్తపేట కు విచ్చేసిన సందర్భంగా కొత్తపేట టిడిపి నేతలు ధర్నాల రామకృష్ణ ధర్మ పాల్ బూసి భాస్కరరావు రెడ్డి తాతాజీ గుబ్బల మూర్తి పెనుమళ్ళ అన్నవరం బండారు వీరబాబు వీధి భాస్కరరావు చోడపనీడి గోవింద్ అన్యం మునీస్ బూసి వెంకటరమణ బొరుసు సత్తిబాబు సాదా సత్తిబాబు నిమ్మకాయల చిన్న ముద్రగడ పని గోలకోటి నాగు పినిపే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల జీవితాల్లో చిరునవ్వులు -- ఎన్టీఆర్ భరోసా పెన్షన్






**- ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్**

**కాజులూరు, పెన్ పవర్, ఏప్రిల్ 1:**కాజులూరు మండలంలోని గొల్లపాలెం, ఆర్యవటం, జగన్నాథగిరి తదితర గ్రామాల్లో బుధవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ కూటమి నాయకులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడిన ఆయన, వారి ఆరోగ్యం, కుటుంబ పరిస్థితులు, ప్రభుత్వ పథకాల లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. పేద ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ప్రతినెలా ఒకటో తేదీన ఇవ్వాల్సిన పింఛన్లను కూడా లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా ఒకరోజు ముందుగానే అందజేస్తున్నామని చెప్పారు.ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పేదలు, వృద్ధులు, విధవలు, దివ్యాంగులకు ఎంతో పెద్ద ఆర్థిక సహాయంగా నిలుస్తోందని, ఈ పింఛన్ వల్ల అనేక కుటుంబాలు గౌరవంగా జీవిస్తున్నాయని అన్నారు. పింఛన్ కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, అది ప్రభుత్వం పేదల పట్ల చూపిస్తున్న బాధ్యత, భరోసా అని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని మొదటి ప్రాధాన్యంగా తీసుకుని పనిచేస్తోందని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు తీసుకొస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రతి అర్హుడికి పింఛన్ అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాజులూరు మండల అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, చుండ్రు వీర్రాజు చౌదరి, ఉపాధ్యక్షులు మేడిశెట్టి వి.వి. సత్యనారాయణ, రైతు అధ్యక్షులు బలుసు శివప్రసాద్, సొసైటీ ప్రెసిడెంట్ కోట తాతబ్బాయి, క్లస్టర్ ఇంచార్జిలు వనం వీరబ్రహ్మం, సలాది సాయిబాబు, పలివెల రాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు నక్క శ్రీను, బొమ్మిడి సోమలమ్మ, యూత్ ప్రెసిడెంట్ అత్తిలి వెంకటరమణ, నల్ల వసంత హరిణి, పైడికొండల రాజేశ్వరరావు,అమలకంటి సత్తిబాబు, కొప్పన లక్ష్మి, గొడిగెళ్లపూడి లక్ష్మీనారాయణ, మాత నాగరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రెడ్డి శేషగిరిరావు, ఖండవల్లి శ్రీనివాసరావు, సనపాల ధనరాజు, వల్లు అర్జునరావు, చందాల ఆదినారాయణ, వడ్లపాటి వెంకటరమణ, కురుపూడి దొరబాబు, కె. హనుమంతు చౌదరి మరియు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ర్యాలి లో అయ్యప్ప స్వామి జన్మదినోత్సవాలు ఘనంగా



**ఆత్రేయపురం, పెన్ పవర్ ఏప్రిల్ 1:**కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని వెలిసిన హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి జన్మదినోత్సవ వేడుకలు బుధవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది.

ఉదయం నుంచే అర్చకులు రఘు, ఫణి ఆధ్వర్యంలో పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి స్వామివారిని అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఈ వేడుకల్లో ర్యాలి పరిసర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణంలోభాగస్వాములయ్యారు.

కార్యక్రమం సందర్భంగా భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, ఆలయ నిర్వాహకులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పించిన ఎస్ఐ



**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 1:** జగ్గంపేటలోని గోకవరం రోడ్డులో బుధవారం సాయంత్రం హెల్మెట్ వినియోగంపై ద్విచక్ర వాహనదారులకు జగ్గంపేట ఎస్సై టి.రఘునాధరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులను నిలుపుదల చేసి వారందరికీ హెల్మెట్ వినియోగం, దాని యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే వారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించకపోతే జరిగే ప్రమాదాలను తెలియజేశారు.

## కూటమి పాలనలో అన్ని వర్గాలకు మేలు.



-భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరకణం రాజబాబు.

**కిర్లంపూడి, పెన్ పవర్,ఏప్రియల్ 01:**కూటమి పాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని కిర్లంపూడి మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరకణం రాజబాబు అన్నారు. ప్రతినెలా క్రమం తప్పకుండా ఒకటవ తారీఖునే కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామంలో కిర్లంపూడి మండలం బిజెపి అధ్యక్షుడు శరకణం రాజబాబు చేతులమీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ వృద్ధులకు 4000,రూపాయలు,వికలాంగులకు 6000రూపాయలు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు 10,000 రూపాయలు, మంచానికే పరిమితమైన వారికి 15.000 రూపాయలు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## జిల్లాలోనే ప్రథమ స్థానం అమలాపురం మున్సిపాలిటీ రికార్డు పన్నుల వసూళ్లు



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 1:** 2025--2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నుల వసూళ్లలో అమలాపురం పురపాలక సంఘం విశేష విజయాన్ని సాధించిందని కమిషనర్ వి. నిర్మల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31, 2026 నాటికి మున్సిపాలిటీలో మొత్తం 80.52% పన్నులు వసూలయ్యాయని, ఇది డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని రామచంద్రపురం, ముమ్మిడివరం మున్సిపాలిటీల కంటే మెరుగైన ఫలితమని ఆయన పేర్కొన్నారు. ?ముఖ్యంగా ఆర్థిక సంవత్సరం ముగింపు రోజైన మార్చి 31న ఒక్క రోజే సుమారు ?86 లక్షల మేర పన్నులు వసూలు చేసి రికార్డు సృష్టించామని కమిషనర్ వెల్లడించారు. ప్రభుత్వం ప్రకటించిన 50% వడ్డీ రాయితీ పథకంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించడం వల్లే ఈ అద్భుతమైన స్పందన వచ్చిందని ఆయన వివరించారు. ?పన్నుల వసూళ్లలో అంకితభావంతో పనిచేసిన రెవెన్యూ ఆఫీసర్ బి. శ్రీలక్ష్మి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాహుల్ అడ్మిన్స్ సిబ్బందిని ఈ సందర్భంగా కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. పట్టణాభివృద్ధికి సహకరించిన పన్ను చెల్లింపు దారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## పొగాకు వాడకం వల్ల శరీరంలోని ప్రతి అవయవం దెబ్బతింటుంది

డా. అడ్డాల సత్యనారాయణ




**కాకినాడ, పెన్ పవర్ ఏప్రిల్ 1:** ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించిన విద్యార్థుల అవగాహన కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డా. అడ్డాల సత్యనారాయణ పొగాకు వాడకం వల్ల కలిగే తీవ్ర ఆరోగ్య నష్టాలను వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పొగాకు అనేది నికోటియానా టబాకమ్ అనే మొక్క ఆకుల నుంచి తయారవుతుందని, ఇందులో ఉండే నికోటిన్ అనే రసాయనం అత్యంత ప్రమాదకరమైనదిగా, వ్యసనానికి గురిచేసేదిగా పేర్కొన్నారు.పొగాకు వినియోగం ప్రధానంగా రెండు విధాలుగా జరుగుతుందని తెలిపారు. సిగరెట్లు, బీడీలు, చుట్టలు వంటి వాటిని ధూమపానం ద్వారా తీసుకోవడం ఒకటి కాగా, ఖైనీ, గుట్కా, పాన్ మసాలా, జర్దా వంటి వాటిని నమలడం మరో విధమని చెప్పారు.పొగాకు వినియోగం వల్ల శరీరంలోని దాదాపు ప్రతి అవయవం దెబ్బతింటుందని, ముఖ్యంగా ఊపిరితిత్తులు, నోరు, గొంతు, అన్నవాహిక, మూత్రపిండాలకు సంబంధించిన క్యాన్సర్లకు ఇది ప్రధాన కారణమని హెచ్చరించారు. అలాగే రక్తపోటు పెరగడం, గుండెపోటు, పక్షవాతం వచ్చే అవకాశాలు ఎక్కువవుతాయని తెలిపారు.

ఇంకా ఆస్తమా, బ్రోన్కైటిస్ వంటి శ్వాసకోశ వ్యాధులు, పళ్ళు పసుపురంగులోకి మారడం, చిగుళ్ల వ్యాధులు, నోటి పూత వంటి సమస్యలు కూడా కలుగుతాయని వివరించారు.

ధూమపానం చేసే వ్యక్తి వదిలిన పొగను పక్కవారు పీల్చడాన్ని 'పాసివ్ స్మోకింగ్' అంటారని, ఇది ధూమపానం చేయని వారికి కూడా ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె సమస్యలు కలిగిస్తుందని, ముఖ్యంగా పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా మరణాలకు దారితీసే నివారించదగిన కారణాల్లో పొగాకు అగ్రస్థానంలో ఉందని పేర్కొంటూ, పొగాకు మానేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడటంతో పాటు ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుందని, క్యాన్సర్ వచ్చే ప్రమాదం గణనీయంగా తగ్గుతుందని సూచించారు.

ఈ కార్యక్రమంలో డా. బి.ఈ.వి.ఎల్. నాయుడు, తేజేశ్వరరావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్మిక సంక్షేమాన్ని విస్మరిస్తే సహించం

**పెండింగ్ క్లయిమ్ లు విడుదల చేయాలని సీఐటీయూ డిమాండ్**

**పెద్దాపురం, పెన్ పవర్, ఏప్రిల్ 1:** భవన నిర్మాణ కార్మికుల న్యాయమైన హక్కుల కోసం పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాల నిధుల విడుదల కోసం సీఐటీయూ పెద్దాపురం మండల కమిటీ సమరశంఖం పూరించింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికులు బుధవారం భారీ ఎత్తున ధర్నా నిర్వహించి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై గళమెత్తారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు చింతల సత్యనారాయణ మాట్లాడుతూ 2020 నుంచి అచేతనంగా ఉన్న సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని అనేక పోరాటాలు చేసినా ప్రభుత్వం మొండి వైఖరిని ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన నాలుగు పథకాలు కేవలం కంటితుడుపు చర్యే అని, కార్మికులకు అత్యంత ఆవశ్యకమైన ప్రమాద బీమా (ప్రమాద మరణం) పథకాన్ని విస్మరించడం వారి ప్రాణాలతో చెలగాటం ఆడటమేనని ధ్వజమెత్తారు. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని ఆయన అల్టిమేటం ఇచ్చారు. అనంతరం సంక్షేమ పథకాల సాధనకై రూపొందించిన గోడపత్రికలను పాండవగిరి పెయింటింగ్ యూనియన్ అధ్యక్షుడు వడ్డి సత్యనారాయణ ఆవిష్కరించారు.




కార్మికులంతా ఐక్యంగా ఉండి తమ హక్కులను కాపాడుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు గడిగట్ల సత్తిబాబు, క్రాంతి కుమార్, ప్రముఖ నాయకులు సిరిపురపు శ్రీనివాస్, మాగాపు నాగు, రాజమండ్రపు రామారావు, గునురి రమణ, ధర్మరాజు, బాషా, దేవా, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## తిరుపతిలో లడ్డుపై రాజకీయం చేయడం తప్ప కూటమి పాలనలో ప్రజలకు చేసిందేమిలేదు.

* మాజీ మంత్రి, జగ్గంపేట వైసీపీ ఇంచార్జ్ తోట నరసింహం.



**కిర్లంపూడి, పెన్ పవర్, ఏప్రియల్ 01:** తిరుపతి లడ్డుపై రాజకీయం చేయడం తప్ప కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు చేసిందేమిలేదని మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట నరసింహం అన్నారు. మండల కేంద్రమైన కిర్లంపూడి దాడి రాజగోపాల్ (రాజా)కార్యాలయంలో రాజా ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి తోట నరసింహం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోట నరసింహం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ఘాటు విమర్శలు గుప్పించారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో లక్షలాది మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను కేటాయించడమే కాకుండా హౌసింగ్ రుణాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్కరికి సెంటు భూమి ఇచ్చిన దాఖలాలు లేవన్నారు.కానీ గత వైసిపి ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్లను తమవిగా చూపిస్తూ ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల సంక్షేమం కోసం నిజంగా ఏం చేశారో చెప్పలేని స్థితిలో ఉన్న ప్రభుత్వం, గత పనులను తమవిగా చెప్పుకోవడం సిగ్గుచేటని తోట నరసింహం వ్యాఖ్యానించారు. తిరుపతి లడ్డు అంశాన్ని ప్రస్తావిస్తూ, దానిని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించు కుంటున్నారని విమర్శించారు. సంబంధిత నివేదికల్లో కల్తీ జరగలేదని విచారంలో స్పష్టంగా తేలినప్పటికీ ప్రజల్లో అనుమానాలు రేకెత్తించేలా తప్పుడు ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారానికి బాధ్యులైన చైర్మన్ బి.ఆర్. నాయుడుపై కూడా తీవ్ర విమర్శలు చేశారు. సోషల్ మీడియాలో ఆయనకు సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్న నేపథ్యంలో, నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే తమ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.కూటమి ప్రభుత్వానికి, టీటీడీ బోర్డు చైర్మన్ బి ఆర్ నాయుడు కళ్ళు తెరవాలని శనివారం జగ్గంపేట నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పవిత్ర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తోట నరసింహం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పెనగంటి రాజేష్, వేగి రామకృష్ణ, పాముల చంటి,తుమ్మల రాజా,దాడి పెదబుజ్జి,యల్లపు నానాజీ,శరకణం సంతోష్,పిట్టా లోవ, టాటా శ్రీను, దాడి చిన్ని రాజ్ గోపాల్ మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సత్యప్రభ చొరవతో చింతలూరులో తాగునీటి కష్టాలకు చెక్.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, ఏప్రియల్ 01:**పెన్ పవర్,కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోని చింతలూరు గ్రామ ఎస్సీ కాలనీ వాసులు తాగునీటి సమస్య ఏర్పడి ప్రజలు అవస్థలుపడుతున్నారు. సమస్యను స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ దృష్టికి రావడంతో తక్షణమే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యకు చెక్ పెట్టారు.తాగునీటి సమస్య తీర్చిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు, సంబంధిత అధికారులకు చింతలూరు గ్రామ ఎస్సీ కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.మళ్లీ సమస్య పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్యే ఈ సందర్భంగా ఆదేశించారు.

# భక్తిశ్రద్ధలతో చండీహోమం



**పెద్దాపురం, పెన్ పవర్, ఏప్రిల్ 1 :** భక్తుల పాలిట కొంగు బంగారంలా విరాజిల్లుతున్న పెద్దాపురం పట్టణంలో కొలువైన మరిడమ్మ అమ్మవారి దేవస్థానంలో చైత్ర శుద్ధ పౌర్ణమి తిథి పురస్కరించుకుని బుధవారం చండీహోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలు నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారి స్వరూపాల్లో చండీ ఒకటని, లోక కళ్యాణార్థం, విశేష కార్యసిద్ధి కోసం సకల చరాచర జగత్ సృష్టికి, స్థితికి, లయకు మూలకారణమైన జగన్మాతను ఆరాధించడం అనాదిగా వస్తోందని, ఏడు వందల మంత్రాలతో కూడిన చండీ సప్తశతిని పారాయణ చేసి, హోమం నిర్వహించడమే చండీ హోమమని పండితులు ఈ సందర్భంగా హోమం విశిష్టత గురించి వివరించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ కె. విజయలక్ష్మి, ఆలయ సిబ్బంది ఎస్. వెంకట రమణ, వేద పండితులు ఇంద్రగంటి ప్రసాద్ శర్మ, నాగదేవర వెంకటశాస్త్రి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపిన కూటమి ప్రభుత్వం.





-ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్ ఏప్రియల్ 01**: నేతన్నల జీవితాల్లో కూటమి ప్రభుత్వం సరికొత్త వెలుగులు నింపిందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా అన్నారు

రాష్ట్ర ప్రభుత్వం నేటి నుండి చేనేత మగ్గాలకు ఉచిత విద్యుత్ అందించే కార్యక్రమం చేపట్టింది. కరెంటు బిల్లుల భారాన్ని తగ్గించి, నేత కార్మికులకు ఆదాయం పెరిగేలా చేసే లక్ష్యంతో కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడు మండలం, ఒమ్మంగి గ్రామంలో గల చేనేత మగ్గాలను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా సందర్శించారు. కొద్దిసేపు నేతన్నలతో మాట్లాడి చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు నెలకు 500 యూనిట్లు కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తుందని దీనివల్ల మీకు చాలా వరకు ఆదా అవుతుందని తెలిపారు. దీనితో వారు చాలా సంతోషం వ్యక్తం చేసి ఇప్పటి వరకు ఎంతో భారంగా ఉన్న మా బ్రతుకుల్లో వెలుగు వచ్చిందని ఆనందం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 93 వేల కుటుంబాలకు లబ్ది చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమరావతి శాశ్వత రాజధాని -- రైతుల త్యాగాలకు న్యాయం జరిగింది: బండారు సత్యానందరావు





**కొత్తపేట, పెన్ పవర్,ఏప్రిల్ 1;**ఆంధ్రప్రదేశ్ పునర్విభజన సవరణ చట్టం లోక్‌సభలో ఆమోదం పొందడం ద్వారా రాజధాని రైతుల త్యాగాలకు సముచిత న్యాయం జరిగినట్టు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. బుధవారం వాడపాలెంలో మీడియాతో మాట్లాడుతూ అమరావతి అంశంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

అమరావతిని ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధానిగా నిలబెట్టాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ, రైతులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై నమ్మకంతో వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ఇచ్చారని గుర్తు చేశారు.గత ప్రభుత్వ హయాంలో ఆ భూములను సక్రమంగా అభివృద్ధి చేసి ఉంటే అనేక పరిశ్రమలు వచ్చి యువతకు ఉపాధి అవకాశాలు లభించేవని పేర్కొన్నారు.అమరావతి విషయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విధానాలను తీవ్రంగా విమర్శిస్తూ, ప్రపంచంలో ఎక్కడైనా రాజధాని అవసరం లేదని చెప్పే నాయకుడు ఉన్నాడా అని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమంపై జగన్‌కు అవగాహన లేదని ఆరోపించారు.

డబుల్ ఇంజన్ సర్కార్ నేతృత్వంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ల సారథ్యంలో అమరావతిలో వేగంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే పలు జాతీయ స్థాయి సంస్థలకు శంకుస్థాపనలు జరిగాయని, హడ్కో, కాగ్, పోస్టల్ వంటి కేంద్ర సంస్థలు స్థాపన దశలో ఉన్నాయని వెల్లడించారు.

రాజ్యసభలో కూడా బిల్లు ఆమోదం పొంది, రాష్ట్రపతి సంతకం తర్వాత గెజిట్ నోటిఫికేషన్ వెలువడితే అమరావతిని ఎవరూ మార్చలేరని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఎలాంటి రాజకీయ మార్పులు వచ్చినా రాజధాని విషయంలో ఎటువంటి అనిశ్చితి లేకుండా చట్టబద్ధ రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

అమరావతి మాత్రమే ఆంధ్రప్రదేశ్ రాజధానిగా కొనసాగుతుందని, ఇది శాశ్వత నిర్ణయమని బండారు సత్యానందరావు నొక్కిచెప్పారు. రాబోయే కాలంలో కూడా కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని, ప్రజలు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి భాస్కరరావు, చికరమేల్లి లవరాజు, కడలి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ కట్టా సేవలు ఎనలేనివి -కూటమి నేతలు



**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 01;**మండలంలోని జన్నాడ గ్రామ పంచాయతీ సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు, పంచాయతీ వార్డు సభ్యులు అందరి పదవీ కాలం గురువారంతో ముగుస్తున్న సందర్భంగా బుధవారం చివరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారందరి సేవలను కొనియాడుతూ కూటమి నాయకులు, కార్యదర్శి, సచివాలయం సిబ్బంది కలిసి ఘనంగా సత్కరించారు. అలాగే సర్పంచ్ కట్టా శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంచాయతీ బోర్డు మెంబెర్స్ ని సన్మానించి వారికి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచులు తాడి శ్రీనివాస్ రెడ్డి, తాడి వెంకన్నబాబు, మల్లిడి సుబ్బిరెడ్డి, బాలిన సూర్యనారాయణ, మట్టా శ్రీను, కార్యదర్శి కె.కృష్ణ, బోర్డు మెంబర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# గ్యాస్ లీకేజీ పట్ల ప్రజలు భయాం దోళన చెందవద్దు నియంత్రణ లోనే బోరు బావి

**అమలాపురం పెన్ పవర్, ఏప్రిల్ 01;**గ్యాస్ లీకేజీ పట్ల ప్రజలు భయాం దోళన చెందాల్సిన అవసరం లేదని అంతా నియంత్రణ లోనే ఉందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు.పి గన్నవరం మండలం బెల్లంపూడి గ్రామంలో మూసివేసిన ఓఎన్జిసి బోరు బావి ఎటువంటి పైప్ లైన్లు లేకుండా ఉన్నదని, దీనినీ నుండి చాలా నెమ్మదిగా గ్యాస్ స్వల్ప లీక్ అవ్వడం జరుగుతోందని గ్యాస్ లీకేజీని అరికట్టేందుకు అమలాపురం రాజోలు కు చెందిన రెండు అగ్నిమాపక వాహనాలు సంఘటనా స్థలానికి చేరుకున్నయన్నారు రెస్క్యూ బృందం కూడా రానున్నదని ప్రజలు ఎటువంటి భయాందోళన లకు గురి కావాల్సిన అవసరం లేదని బోరుబావి నుండి లీకేజీ ను ఆరికేట్టేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు కొనసాగుతున్నా యన్నారు ఈ లీకేజీ ప్రధాన వాల్వుకు సంబంధించినది కాదని భయపడాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం రిసిడ్యూవల్ లీకేజ్ మాత్రమే నన్నారు కొన్ని గంటలలో పూర్తిగా లీకేజ్ ఆగిపోతుందని ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. నియంత్రణ చర్యల్లో భాగంగా ఓ ఎన్ జి సి బృందం అగ్నిమాపక యంత్రాలు లీకేజ్ను అరికట్టే ప్రయత్నంలో ఉన్నాయన్నారు. సాంకేతిక బృందం సూచనల ప్రకారం ఎవరిని తరలించాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు



03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## యువమోర్చ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్..స్వచ్ఛతతో ప్రజరోగ్యం ....





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఏప్రిల్ 01.**స్వచ్ఛత తోనే ఆరోగ్య పరిరక్షణ సుసాధ్యమని యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింధు గట్టిం అన్నారు. భారతీయ జనతా యువమోర్చ అధ్యక్షులు కంచెర్ల రాజా ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పాతూరు సంజీవ్ నగర్ లోని ఈలి ఆంజనేయులు మునిసిపల్ హైస్కూల్ వద్ద స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. సింధు గట్టిశీ మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి వాడవాడల స్వచ్ఛభారత్ కార్యక్రమాలు చేపట్టాలని నిర్దేశించారన్నారు. నాటి దేవాదాయ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం పట్టణ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ప్రతి ఆదివారం ఉదయం బిజెపి, నాయకులు, యువమోర్చ, మహిళా మోర్చా నాయకులు కార్యకర్తలు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించేవారన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమం వలన పరిసరాలు పరిశుభ్రత ఆరోగ్య గారు వాతావరణం నిర్మాణం చేయడంతో ప్రజల ఆరోగ్యం మెరుగుపడిందన్నారు. ప్రతి కుటుంబానికి వేలాది రూపాయలు మందులు ఆసుపత్రి ఖర్చులు ఆదా అయ్యాయని కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలలో వెల్లడైందన్నారు. ప్రతి ఒక్కరూ తమ నివాసాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యానికి కాపాడుకోవాలని అన్నారు. యువమోర్చా అధ్యక్షులు కంచర్ల రాజ మాట్లాడుతూ దివంగత మంత్రి పైడికొండల మాణిక్యాలరావు స్ఫూర్తితో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలు అందరిని భాగస్వాములు చేస్తామని తెలిపారు.పాతూరు 12వ వార్డు సంజీవ్ నగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మహిళామోర్చా అధ్యక్షురాలు గోకా మహాలక్ష్మి , ఎస్.టి మోర్చా కుతడ కళ్యాణి,సన్నిధి లక్ష్మి దుర్గ ,గోక షణ్ముక్ చెరుకూరి గంగాధరం ,ఇమ్మాంది బెనర్జీ, సిరిగినీడి పాండురంగరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బ్రహ్మం,మునిసిపల్ పారిశుధ్య ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరావు, కార్యదర్శి లత,పారిశుధ్యాకార్మికులు పాల్గొన్నారు

# సర్పంచ్ లకు నేడే ఆఖరి రోజు

**వై రామవరం, పెన్ పవర్, ఏప్రిల్ 1:** సర్పంచ్ పదవులకు గురువారం ఆఖరి రోజు అని ప్రభుత్వం సర్క్యులర్ లో తెలిపింది.

ఏప్రిల్ రెండవ తేదీతో పంచాయతీ సర్పంచుల పదవీకాలం ముగుస్తుండడంతో వీరి స్థానంలో పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించడం జరిగింది. ఈనెల మూడవ తేదీ నుండి ప్రతి పంచాయతీకి స్పెషల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో పంచాయతీల నిర్వహణ పనులు జరుగుతాయని, పంచాయతీ ఎలక్షన్లు నిర్వహించే వరకు స్పెషల్ ఆఫీసర్లు విధుల్లో ఉంటారని తెలిసింది.




## వై రామవరం,గుర్తేడు మండలాల్లో 98 శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ





**వై రామవరం/ గుర్తేడు, పెన్ పవర్, ఏప్రిల్ 1:** బుధవారం పంపిణీ చేసిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు వై రామవరం, గుర్తేడు మండలాల్లో 98 శాతం పంపిణీ చేయడం జరిగిందని ఎంపీడీవో కే.బాపన్న దొర తెలిపారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పింఛన్లు పంపిణీ కార్యక్రమం ఇంటింటికి వెళ్లి బుధవారం ఉదయం 6 గంటల నుండి పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల వరకు వై రామవరం మండలంలో 1819 మందికి వివిధ రకాల పింఛన్లు మంజూరు కాగా 1768 మందికి పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. గుర్తేడు మండలంలో 1347 మంది పింఛనుదారులు కాగా 1333 మందికి పంపిణీ చేయడం జరిగింది అన్నారు. వై రామవరం మండలంలో ఉదయం నుండి మండల స్పెషల్ ఆఫీసర్ దేవదానం, ఎంపీడీవో బాపన్న దొర పింఛన్లను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## లైన్ ఇన్స్పెక్టర్ సేవలు ప్రశంసనీయం - ఏడిఈ శ్రీధర్



**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 01;**లైన్ ఇన్స్పెక్టర్ వాసంశెట్టి సత్యనారాయణ సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో మండపేట ఏడీఈ శ్రీధర్, ఏఈ దుర్గా ప్రసాద్ ల ఆధ్వర్యంలో మార్చి 31తో ఆయన పదవీ కాలం పూర్తి చేసుకున్న నేపథ్యంలో విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభలో సత్యనారాయణ దంపతులను పూలమాలలతో సత్కరించి దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. రామచంద్రపురం డీఈ రత్నాలరావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి సత్యనారాయణ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్లు, లైన్ ఇన్స్పెక్టర్ లు, లైన్ మెన్ లు, షిఫ్ట్ ఆపరేటర్లు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్,ఏప్రియల్ 01:** కాకినాడ జిల్లా కలెక్టర్ గా నూతనంగా నియమితులైన ఎం.ఎన్ హరేంద్ర ప్రసాద్ ను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభా రాజా బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి బదిలీపై వెళ్లడంతో విశాఖపట్నం జిల్లా కలెక్టర్ గా పనిచేస్తున్న ఎం.ఎన్ హరేంద్ర ప్రసాద్ ను కాకినాడ జిల్లా కలెక్టర్ గా ప్రభుత్వం బదిలీ చేసింది.బదిలీ పై వచ్చిన కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఎమ్. ఎన్. హరేంద్ర ప్రసాద్ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించడంతో కలెక్టరేట్ కార్యాలయంలోని ఆయన ఛాంబర్ లో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మార్చ్ ఫాస్ట్ నేపథ్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 1:** మార్చ్ ఫాస్ట్ కార్యక్రమాల నేపథ్యంలో పట్టణం పరిసర ప్రాంతాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ప్రజల భద్రత దృష్ట్యా ముఖ్య కూడళ్ల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, వాహనాలను ఆపి పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. పట్టణంలోని దేవాంగుల వీధి నుండి, గోల్డ్ మార్కెట్, శ్రీదేవి మార్కెట్, ముస్లిం మీద మీదుగా పట్టణ సీఐ ఆధ్వర్యంలో మార్చ్ ఫాస్ట్ చేశారు. పోలీసు అధికారులు బస్సు స్టాండ్లు, , మార్కెట్ ప్రాంతాలు, ప్రధాన రహదారుల వద్ద పర్యవేక్షణ మరింత కట్టుదిట్టం చేశారు. గుర్తింపు పత్రాలు లేని వ్యక్తులను ప్రశ్నించి వివరాలు నమోదు చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, వాహన పత్రాలు వెంట ఉంచుకోవడం, ట్రిపుల్ రైడింగ్ చేయకూడదని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. శాంతి భద్రతలు కాపాడటంలో ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ వీరబాబు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# ఘనంగా సెయింట్ యూజిన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో వార్షికోత్సవ వేడుకలు



**తాళ్ళపూడి, పెన్ పవర్, ఏప్రిల్ 1:** తాళ్ళపూడిలోని సెయింట్ యూజిన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నూతన వేదిక, గ్రంథాలయమును ఫాదర్ ఆరోగ్య సామి ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా ఫాదర్ బెంజిమెన్ ఈ కార్యక్రమానికి విచ్చేశారు. అతిథులుగా విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పాఠశాల అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఆరోన్, ప్రిన్సిపల్ ఫాదర్ జాన్ బ్రిట్టో, కరెస్పాండెంట్ ఫాదర్ కిషోర్ వార్షిక నివేదికను చదివి విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నృత్యాలు తల్లితండ్రులను ఆకట్టుకున్నాయి. పాఠశాలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా ఫాదర్ ఆరోగ్య సామి(ట్రెజరర్ ఆఫ్ సెయింట్ యూజింన్ ప్రావెన్స్ ఆఫ్ ఇండియా), ఫాదర్ బెంజిమెన్ విద్యార్థులను అభినందిస్తూ వారి బంగారు భవిష్యత్తు కోసం మంచి సూచనలు చేశారు. చివరిగా కృతజ్ఞతా కార్యక్రమములో వేడుకలు విజయవంతంగా ముగిసాయి.

## మహిళ క్రికెట్‌లో సంచలనం.. టీమిండియా

# రికార్డు బ్రేక్ చేసిన కివీస్ కెప్టెన్



**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూజిలాండ్ వర్సెస్ సౌతాఫ్రికా మహిళల రెండో వన్డే వెల్లింగ్టన్ వేదికగా జరిగింది. ఈ మ్యాచులో కివీస్ అమ్మాయిల జట్టు చారిత్రత్మక విజయాన్ని నమోదు చేసింది. సఫారీ జట్టు నిర్ధేశించిన 347 పరుగుల టార్గెట్ న్ని చేధించి టీమిండియా పేరిట ఉన్న ప్రపంచ రికార్డును న్యూజిలాండ్ తిరగరాసింది. ఉమెన్స్ వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగులు ఛేజ్ చేసిన జట్టుగా బ్లాక్ క్యాప్స్ రికార్డుల్లోకి ఎక్కింది. కాగా ఇంతకు ముందు ఈ హిస్టరీ భారత మహిళల జట్టు పేరుపై ఉండేది. వన్డే ప్రపంచకప్-2025లో ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్ లో ఉమెన్ ఇన్ బ్లూ.. 339 రన్స్ లక్ష్యాన్ని చేజ్ చేసింది. ఇప్పుడు ఈ రికార్డును న్యూజిలాండ్ బ్రేస్ చేసేసింది. ఈ మ్యాచ్ మొదట బ్యాటింగ్ చేసిన ప్రోటీస్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 346 రన్స్ చేయగా.. దక్షిణాఫ్రికా బ్యాటర్లలో అన్నేకే బోష్ (91), కెప్టెన్ లారా వోల్వార్డ్(69), ట్రయోన్(52), జాఫ్టా(37) అద్భుతంగా ఆడారు.

ఇక ఈ భారీ లక్ష్య చేధన కోసం బరిలోకి దిగిన న్యూజిలాండ్ బ్యాటర్లు సుజీ బేట్స్(8), ప్లిమ్మర్(23), మ్యాడీ గ్రీన్(13) ఘోరంగా విఫలం కావడంతో కెప్టెన్ అమెలియా కెర్ మాత్రం సంచలన ఇన్నింగ్స్ ఆడింది. ఓ వైపు క్రమంగా వికెట్లు పడుతున్నప్పటికి ఆమె మాత్రం తన విధ్వంసకర బ్యాటింగ్ ని కొనసాగించింది. చివరి ఓవర్లో 11 పరుగులు కావాల్సి ఉండగా.. కేర్ వరుసగా 3 బౌండరీలు బాది కివీస్ జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించింది. ఈ మ్యాచులో కెప్టెన్ అమేలియా కెర్ కేవలం 139 బంతుల్లో 23 ఫోర్లు, ఒక సిక్సుతో 179 పరుగులు చేసి అజేయంగా నిలిచింది.

మొత్తంగా మహిళల వన్డే క్రికెట్లో లక్ష్య చేధనలో అత్యధిక వ్యక్తిగత స్కోర్ సాధించిన రెండో ప్లేయర్ గా అమెలియా కేర్ నిలిచింది. అలాగే న్యూజిలాండ్ గడ్డపై వన్డేల్లో అత్యధిక వ్యక్తిగత పరుగులు సాధించిన మహిళ ప్లేయర్ గా కూడా కేర్ చరిత్ర నెలకొల్పింది. మ్యాచ్ అనంతరం జరిగిన మీడియా ప్రెజెంటేషన్‌లో కేర్ మాట్లాడుతూ.. ఈ ఇన్నింగ్స్ నాకు చాలా ప్రత్యేకమైనది. మేము డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్నప్పుడు కూడా గెలవగలమని నమ్మా, నేను మైదానంలోకి వెళ్లిన తర్వాత ముందుకు సాగాల్సిందేనని ఫిక్స్ అయినట్లు వెల్లడించింది.

# ఐపీఎల్‌లో డబ్బులు రావు.. అందుకే ఆడట్లేదు: ఆడమ్ జంపా

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచంలోని అత్యుత్తమ వైట్ బాల్ స్పిన్నర్లలో ఒకడైన ఆస్ట్రేలియా లెగ్ స్పిన్నర్ ఆడమ్ జంపా, ఐపీఎల్ 2026 వేలానికి దూరంగా ఉండటంపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. తన నైపుణ్యానికి ఐపీఎల్‌లో సరైన విలువ, డబ్బు లభించడం లేదని, అందుకే ఈ లీగ్‌లో ఆడటం లేదని స్పష్టం చేశాడు. ప్రస్తుతం జంపా పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో కరాచీ కింగ్స్ తరఫున ఆడుతున్నాడు. ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ జంపా తన అసంతృప్తిని బయటపెట్టాడు. "ఈ ఏడాది నేను ఐపీఎల్ నుంచి తప్పుకున్నాను. నిజం చెప్పాలంటే, నా లాంటి నైపుణ్యం ఉన్న ఆటగాడికి ఐపీఎల్‌లో ఇతర నైపుణ్యాలు ఉన్నవారికి లభించేంత డబ్బు రాదు. ఐపీఎల్ కోసం చాలా సమయం కేటాయించాల్సి ఉంటుంది. కానీ, అందుకు తగిన ప్రతిఫలం లేనప్పుడు అంత సమయం వెచ్చించడం సరైన నిర్ణయం అని నాకు అనిపించలేదు" అని జంపా వివరించాడు. గతంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జంపాను విడుదల చేయగా, అతను ఈసారి వేలం కోసం తన పేరును నమోదు చేసుకోలేదు. 2016లో రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్‌తో అరంగేట్రం చేసిన అతను, ఆ తర్వాత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) జట్లకు కూడా ప్రాతినిధ్యం వహించాడు. మొత్తం 22 ఐపీఎల్ మ్యాచ్‌లలో 8.37 ఎకానమీ రేటుతో 31 వికెట్లు పడగొట్టాడు. అయితే, ఏ సీజన్‌లోనూ ఆరు కంటే ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేకపోయాడు.

పీఎస్ఎల్‌లో ఆడాలన్నది చివరి నిమిషంలో తీసుకున్న నిర్ణయమని జంపా తెలిపాడు. మొదట విశ్రాంతి తీసుకోవాలని భావించినా, నెల రోజుల క్రితం పీఎస్ఎల్ నుంచి అవకాశం రావడంతో వెంటనే అంగీకరించానని చెప్పాడు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం తుది జట్టులో నలుగురు విదేశీ ఆటగాళ్లకే అవకాశం ఉంటుంది. దీంతో ఫ్రాంచైజీలు ఎక్కువగా పవర్ హిట్టర్లు, ఆల్-రౌండర్లు, ఫాస్ట్ బౌలర్ల కోసం భారీ మొత్తంలో ఖర్చు చేస్తాయి. స్పిన్నర్ల విషయంలో భారత్‌లో



నాణ్యమైన స్థానిక ఆటగాళ్లు అందుబాటులో ఉండటంతో విదేశీ స్పిన్నర్లకు పెద్దగా డిమాండ్ ఉండటం లేదు. జంపా వ్యాఖ్యలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

# భారత్-జింబాబ్వే మధ్య రెండు సిరీస్‌లు.. షెడ్యూల్ విడుదల



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియా మరో అంతర్జాతీయ సిరీస్‌కు సిద్ధమైంది. ఈ ఏడాది జులైలో జింబాబ్వేలో పర్యటించి మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో పాల్గొననుంది. ఈ మేరకు జింబాబ్వే క్రికెట్ బోర్డు అధికారిక ప్రకటన విడుదల చేసింది. హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జులై 23, 25, 26 తేదీల్లో ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. భారత కాలమానం ప్రకారం అన్ని మ్యాచ్‌లు సాయంత్రం 4:30 గంటలకు ప్రారంభమవుతాయి. ఇటీవల ముగిసిన 2026 టీ20 ప్రపంచకప్‌లోనూ ఇరు జట్లు తలపడ్డాయి. చెన్నైలో జరిగిన సూపర్-8 దశ మ్యాచ్‌లో భారత్ 72 పరుగుల తేడాతో జింబాబ్వేపై ఘన విజయం సాధించింది. అంతకుముందు 2024 టీ20 ప్రపంచకప్ గెలిచిన వెంటనే కూడా టీమిండియా జింబాబ్వేలో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడి 4-1 తేడాతో గెలుపొందింది. తాజా ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా, శ్రీలంక వంటి బలమైన జట్లు ఉన్న గ్రూప్‌లో టాప్‌లో నిలిచి సూపర్-8కు చేరిన జింబాబ్వే, అదే జోరును సొంతగడ్డపై కొనసాగించాలని భావిస్తోంది.

ఈ సిరీస్‌పై జింబాబ్వే క్రికెట్ మేనేజింగ్ డైరెక్టర్ గివ్‌మోర్ మకోనీ మాట్లాడుతూ.. "భారత్‌తో మ్యాచ్‌లంటే ఎప్పుడూ భారీ ఆసక్తి ఉంటుంది. ప్రపంచ ఛాంపియన్లతో సొంతగడ్డపై తలపడటం మా ఆటగాళ్లకు ఒక గొప్ప అవకాశం. ప్రపంచకప్‌లో మా ప్రదర్శన ప్రోత్సాహకరంగా ఉంది. ఈ సిరీస్ ద్వారా ఆ జోరును కొనసాగించి, అంతర్జాతీయ క్రికెట్‌లో మరింత పోటీ శక్తిగా ఎదగడానికి ఇది బలమైన పునాది వేస్తుంది" అని వివరించారు. ఇక, వచ్చే ఏడాది ఆరంభంలో జింబాబ్వే జట్టు భారత్‌లో పర్యటించనున్నట్లు బీసీసీఐ ఇదివరకే ప్రకటించింది. 2027 జనవరిలో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరగనుంది. కోల్‌కతా (జనవరి 3), హైదరాబాద్ (జనవరి 6), ముంబై (జనవరి 9) ఈ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. దాదాపు 25 ఏళ్ల తర్వాత జింబాబ్వే జట్టు భారత్‌లో ద్వైపాక్షిక సిరీస్ ఆడనుండటం విశేషం. చివరిసారిగా 2002 మార్చిలో జింబాబ్వే భారత్‌లో పర్యటించింది. ఈ సుదీర్ఘ విరామం తర్వాత భారత్‌లో పర్యటించడంపై మకోనీ సంతోషం వ్యక్తం చేశారు. "రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ ద్వైపాక్షిక సిరీస్ కోసం భారత్‌లో పర్యటించడం ఒక చారిత్రాత్మక క్షణం. ఇది మా ఆటగాళ్లకు దక్కిన గౌరవం, విలువైన అవకాశం. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య క్రికెట్ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని, మా జట్టుకు ఎంతో అనుభవాన్ని ఇస్తుందని ఆశిస్తున్నాం" అని తెలిపారు.

# అఖిల్ ని మారుతి లైన్ లో పెడుతున్నాడా?

అక్కినేని వారసుడు అఖిల్ సక్సెస్ కోసం ఎలా ఎదురు చూస్తున్నాడో? చెప్పాల్సిన పనిలేదు. ఎన్నో ఆశలు పెట్టుకున్న -ఏజెంట్- ఫలితం ఊహించని విధంగా రావడంతో? మరోసారి ఫ్లాప్ రూపంలో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. -మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్ లర్- తో వచ్చిన సక్సెస్ ను -ఏజెంట్- తోనూ కొనసాగించాలని చూసిన ఆలోచనకు బ్రేక్ పడింది. -ఏజెంట్- హిట్ అయితే కెరీర్ కొత్త టర్నింగ్ తీసుకుంటుందని ఎంతో ఆశించాడు కానీ ఫలితం తీవ్ర నిరాశనే మిగిల్చింది. దీంతో కొత్త కథలు, దర్శకుల విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నాడు.







ప్రస్తుతం మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వంలో -లెనిన్- లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. రాయలసీమ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కుతోన్న చిత్రమిది. ఇప్పటికే చిత్రీకరణ ముగింపు దశకే చేరుకుంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా జరుగుతున్నాయి. సమ్మర్ కానుకగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. అయితే అగ్ర హీరోల చిత్రాలు రిలీజ్ కు ఉండ టంతో వెనక్కి తగ్గుతున్నాడు. మరి తదుపరి చిత్రాల సంగతేంటి? అంటే ఓ ఇంట్రెస్టింగ్ విషయం లీకైంది. అఖిల్ కోసం మారుతి ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే అఖిల్ తో రెండు..మూడు మీటింగ్లు కూడా జరిగాయని సన్నిహిత వర్గాల నుంచి తెలిసింది.

మరి ఈ కాంబో సెట్ అవుతుందా? లేదా? అన్నది ఇంకా చర్చల దశలో ఉంది కాబట్టి క్లారిటీ రావడానికి సమయం పడతుంది. మారుతి చివరిగా ప్రభాస్ తో తెరకెక్కించిన -ది రాజాసాబ్- ఫ్లాప్ అయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి మారుతి హీరోల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తర్వాత ఏ హీరోతో సినిమా చేసిన అది పక్కా హిట్ అవ్వాలనే కసితో పని చేస్తున్నాడు. ఇప్పటికే మారుతి అక్కినేని కాంపౌండ్ లో నాగచైతన్య హీరోగా -శైలిజ రెడ్డి అల్లుడు- అనే సినిమా తెరకెక్కించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాకు మిశ్రమ స్పందన వచ్చింది. కానీ కమర్శియల్ గా మంచి లాభాలే తెచ్చి పెట్టింది. ఆ పాజిటివ్ సైన్ అఖిల్ సినిమా పరంగా కలిసొచ్చే అవకాశం ఉంది.ద

అఖిల్ కూడా కొత్త దర్శకుల్ని ఎంచుకోవడంలో విఫలమవుతున్నాడు. ఇంత వరకూ అతడు చేసిన ప్రయత్నాల్లో ఒకటి రెండు తప్ప పెద్దగా కలిసి రాలేదు. ఈ క్రమంలో మారుతి లాంటి అనుభవం ఉన్న దర్శకుడితో సినిమా చేస్తే అఖిల్ కి ప్లస్ అవుతుందనే భావన ఉంది. ఇంకా అఖిల్ వేర్వేరు దర్శకులతోనూ టచ్ లో ఉన్నాడు. వాళ్లందరిలో ఎవరి మంచి కథతో ముందుకొస్తే వాళ్లతోనే ముందుకెళ్తాడు. మరి మారుతి విషయంలో ఎలాంటి ప్రకటన వస్తుందో చూడాలి.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 4-79, Revenue Colony, Tammireddy Palem, Kottapeta Editor : Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A3664 , e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965